# సమర్థ సద్గురు

సెప్టెంబర్ 2025

ఆధ్యాత్మిక మాసపత్రిక


వెల : రూ. 10.00



## ఆగష్టు 15 నుండి 20 వరకు శ్రీ కాళీవనాశ్రమంలో జరిగిన శ్రీకృష్ణాష్టమి వేడుక దృశ్యములు









# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293206.
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**

డా॥ యమ్. స్వర్ణముఖి
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ
సన్నిధానం కాళీమాత

సంపుటి 45 సంచిక 1
పేజీలు 44
సెప్టెంబర్ 2025

5సం॥ల చందా రూ. 500
2సం॥ల చందా రూ. 240
సంవత్సర చందా రూ. 120
విడిప్రతి వెల...... రూ. 10


**బ్యాంక్ డ్రాఫ్ట్** Y.S.C.K.P.M **చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.**
**M.O, బ్యాంక్ డ్రాఫ్ట్లు పంపవలసిన చిరునామా**
**మేనేజరు**
**సమర్థ సద్గురు మాగజైన్**
**శ్రీకాళీగార్డెన్స్ – 522508, నంబూరు**
**గుంటూరు జిల్లా**

Published by
Paluri Siva Rama Kali Prasad
on behalf of
YOGINI SRI CHANDRA
KALI PRASADA MATHAJI
CHARITABLE TRUST
and Printed at
Nagendra Enterprises,
D.No.24-7-8, Sandeep Mansion
Jonnavittula Vari St.
Gandhi Nagar, Vijayawada
N.T.R. Dist., Andhra Pradesh.
Published at
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh, Editor
PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**

శ్రీ కాళీ ప్రసాద శతకము .................... ..........4
శ్రీబాబూజీ ఉవాచ........................................ 5
అమ్మమాట.................................... ............ 7
బాలకృష్ణుడు - బాబు.................... ....... .......9
దత్తాత్రేయుడు.......... ................. ...........................13
భగవద్గీత సాధన దీపిక ................................16
శ్రీ మాతాజీ ఐరోపా పర్యటన విశేషాలు18
శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద్ బాబూజీ మహరాజ్‌వారి సహస్ర నామావళిః ....... 20
శ్యామ సుందరా! ఒక్కసారి, ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ! 22
నారద భక్తి సూత్రములు ................ ..............24
శ్రీబాబు దివ్యవాణి.............................................26
శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు....27
గురుక్షేత్రం.............. ......................................28
ప్రథమ దర్శనం .................................................30
నిరీక్షణ ........................................................................33
శ్రీ గురుగీత .......................................... ........36
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....38
జీవుడు - పరమాత్మ ......................................40
విష్ణు కథలు ....... ............................ ....................41

## శ్రీ కాళీ ప్రసాద శతకము - పాలూరి ప్రసాద్



4. *గురువు నవ్వెనని గురువు తినెనని*
*నన్నె మిన్నగా ఇష్టపడునందువు*
*పండెన్నడైన మరల కాయౌనె*
*కాళీ ప్రసాదు మాట కాంతిబాట ॥*

తా: కొంతమంది గురువులను ఆశ్రయించి ఎంతకాలం వారి సాన్నిధ్యాన్ని అనుభవించినా ఇంకా వారిని మానవమాత్రులుగానే చూస్తూ "ఇవాళ మా గురువుగారు నన్ను నవ్వుతూ పలుకరించారు, లేదా నేను సమర్పించిన పదార్థాన్ని తిన్నారు, గురువుగారికి అందరికంటే నేనంటేనే ఎక్కువ ఇష్టం, లేదా మా గురువుగారికి నేనంటే ఇష్టం లేదు, ఫలానా వారంటేనే ఇష్టం" ఇలా మాట్లాడుతూ ఉంటారు. గురువు అంటే ఇటువంటి ద్వంద్వాలకి, గుణాలకి అతీతుడు. ఒకసారి పండిన పండు మళ్ళీ కాయగా, పచ్చిగా మారనట్లు ఒకసారి ఆత్మజ్ఞానాన్ని పొంది, ఆ జ్ఞానస్వరూపుడు తానైన గురువు మళ్ళీ ఇటువంటి అజ్ఞానపు లక్షణాలను ఎలా పొందుతారు?

1) బురదను ఎండించి, అగ్నిని మండించి, మునిగిపోయేవాడిని వుద్ధరించే విచిత్ర జలం ఏది?
2) దేవుడికి నీమీద నమ్మకం ఎప్పుడు కలుగుతుంది?
3) కామాదులను చిగురించిన వెంటనే వాటిని తుంచి వేయాలి?
4) అర్జునుడి రధానికి పూన్చిన గుఱ్ఱాలు ద్వారకలోనికి ప్రవేశించడానికి ఎందుకు నిరాకరించాయి?
5) తన తమ్ముడికి జ్ఞానప్రబోధం కలగడానికి అబద్ధమాడినది ఎవరు?
6)కృష్ణుడు గోపబాలుర రూపాలను ధరించినట్లు శ్రీబాబు ఎవరెవరి రూపాలు ధరించారు?
7) మన చర్మంలో, మాంసంలో, ఎముకలలో ఇలా అంతటా జగన్మాతే నిండి ఉన్నదనే రుజువు భక్తునికి ఎలా లభించింది?
8) చావన్నా, క్రూరమృగాలన్నా భయం ఎవరికి కలుగుతుంది?

***సమాధానాలు లోపలి పేజీలలో ..........................***

# **శ్రీ బాబూజీ ఉవాచ** - కీ.శే. పరాశర ప్రసాద్

29-6-1981

ఈరోజు ఉదయం భక్తులకు దర్శనం ఇచ్చి శ్రీ బాబూజీ మాట్లాడుతూ 'మీ స్వధర్మాన్ని మానుకుని ఇక్కడకు రాకండి. మీ పనులు సక్రమంగా చేసుకుని ఖాళీగా వున్నప్పుడు ఇక్కడికి రండి. మీరు ఇక్కడనే ఉండనవసరం లేదు. ఎక్కడ ఉన్నా నా ఆశీస్సులు ఉంటాయి.



నా బాల్యంలో డాక్టరు శేషగిరి రావుగారు, చిరంజీవిరాజు గారు అని ఇరువురు భక్తులు నాతోనే ఉండేవారు. నాకు చతుర్విధ శుశ్రూషలు చేసేవారు. పరమభక్తులు. చివరికి వారు పొంద వలసినది ఏదో పొందారనుకోండి. ఇప్పటి శిష్యులలో చాలామంది అవసరార్థ భక్తులు. భౌతిక దృష్టితో కోర్కెలతో వస్తారు. నా వలన ఎన్నో లాభాలు పొంది కూడ నేను తెలుసునన్న విషయాన్నే మరచిపోయారు.

నా బాల్యంలో శ్రీశైలం వెళ్లినప్పటి సంఘటన చెప్తాను. శివరాత్రికి ఉత్సవాలు వైభవంగా జరిగేవి. భక్తులు విశేషంగా వచ్చేవారు. ఆ తర్వాత ఆలయం మూసివేసేవారు. శ్రీశైలంలో ఏమీ వసతి కూడా ఉండేది కాదు. చెట్ల క్రిందనే ఉండేవారు వచ్చిన భక్తులంతా. శివరాత్రి అయిపోయాక కూడ నేను మాత్రం ధ్యానం చేసుకుంటూ ఆలయంలోనే ఉండేవాడిని. దోపిడి దొంగలు వచ్చేవారు ఆలయంలోనికి. ఎవరైనా వారి కంటపడితే చంపేస్తారు. క్రూరమృగాలు కూడా వచ్చేవి. అయితే నాకు భయం ఏముంది? నేను దేనికి భయపడాలి? ఇంద్రియదృష్టి, దేహదృష్టి వున్నవారికి చావన్నా, క్రూరమృగాలన్నా భయంగాని అదిలేని వాడికి భయం ఎందుకు?

ఒకసారి నేను వారికంట పడ్డాను. నన్ను వాళ్ల నాయకుడి దగ్గరికి తీసుకువెళ్లారు. వాళ్ల నాయకుడు 'అక్కడ ఎందుకు ఉన్నావు?' అని ప్రశ్నించాడు.

'నేను ధ్యానం చేసుకుంటున్నాను, ప్రశాంతంగా ఉంది' అని చెప్పాను. నా జనని వారి హృదయాల్లో ప్రవేశించి నన్ను రక్షించింది. ఆ రోజులలో అలా స్వేచ్ఛగా తిరిగేవాడిని. మీరంతా కలసి నాకు ఇలా బంధన ఏర్పరచారు.

శ్రీశైలంలో ఉండగా నేను ధ్యానం చేసుకుంటూ స్వామీ! నేను ఎక్కడ  ఉండాలి? అని మల్లికార్జునుని ప్రశ్నించినపుడు, ఇదుగో నా హృదయంలో ఉండు అన్నట్లుగా భావన కల్గింది. నేను ఈ విషయాన్ని శేషగిరిరావుగారితో చెపుతూండగా, కోనసీమ పండితుడు విని నా వంక విచిత్రంగా చూశాడు. నాపైన ప్రశ్నల వర్షం కురిపించాడు. మీరు ఎవరు? బ్రాహ్మణులా? వివాహం అయిందా? మీరు వేదాలు ఉపనిషత్తులు చదువుకున్నారా! అని అడిగారు.

అప్పుడు నేను ప్రశ్నించాను. మీరు ఎవరు? మీరు బ్రాహ్మణులని ఎలా తెలుసు? ఎవరు చెప్పారు? మీ తండ్రిగారు చెప్పకపోతే ఎలా తెలుస్తుంది? మీ తండ్రిగారికి ఎవరు చెప్పారు? వారికి మీ తాతగారు చెప్పి ఉండాలి. అంతేకాని మీకు తెలియదు కదా! పుట్టుకతో ఎవరూ బ్రాహ్మణులు కారు. ముందు నీ ఉనికి తెలుసుకో! నీవెవరవో తెలిస్తే అప్పుడు నేనెవరో తెలుస్తుంది. తానెవరో తాను తెలుసుకున్నవాడికి ఇంక ప్రశ్న ఉదయించదు. ప్రశ్నలేనివాడికి ఆన్సరు ఏమి ఉంటుంది? ఆ పండితుడు తన శేషజీవితాన్ని నా సాన్నిధ్యంలోనే గడిపాడనుకోండి" అన్నారు శ్రీ బాబు.

---

**పూజ్యశ్రీ మాతాజీ వారి సత్సంగ సమావేశములు**

**3-9-25 నుండి 7-9-25 వరకు**

**హైదరాబాద్ శాఖలో సత్సంగ సమావేశములు**

**వివరములకు: మనోహర్ - 99483 97063.**

## అమ్మ మాట

- జపమాలా ప్రసాద

# సర్వరోగ హారిణి - జగన్మాత

(23-9-1998న జగజ్జనని యొక్క దివ్యనామధ్యానం యొక్క అనంతశక్తిని వివరిస్తూ ఒక దేవీభక్తునికి కలిగిన అనుభవాన్ని శ్రీ మాతాజీ ఈ విధంగా వివరించారు)



"లలితా ఉపాసకుడయిన ఒక భక్తుడుండేవాడు. ఆయనకి ఒక ఆక్సిడెంటు జరిగి, చాలా దెబ్బలు తగిలి, తెలివిలేని స్థితిలో ఆస్పత్రిలో చేర్చబడ్డాడు. ఆయనకి స్పృహ వచ్చిన పిదప, తన దేహస్థితిని చూచి, యీ విధంగా యింకా ఎన్నినాళ్ళు ఆస్పత్రిలో వుండాలని డాక్టర్లని ప్రశ్నిస్తే, వారు ఆరు నెలలుండాలని చెప్పారు. నిరంతరం, ఎంతో ఉత్సాహంతో, కర్మశీలుడై వుండే ఆయనకి యీ మాట అశనిపాతంలా తగిలింది. ఆయనకి వీపు మీద తగిలిన దెబ్బలకి, చర్మం అంతా కూడా విడిపోయిందట. దానికి డాక్టర్లు ప్లాస్టిక్ సర్జరీ చేసి, వారిని ఏడు రోజుల పాటు బోర్లా పడుకుని వుండాలని నిర్దేశించారు. ఆ బాధని ఓర్చుకోవడానికాయన, లలితా సహస్రనామాలను మనసులోనే చదువుతూవుండగా, **'త్వక్‌స్థాయై నమః'** అనే నామం మీద ఆయన మనసు నిలబడిపోయి, విచారణలోకి వెళ్ళిపోయాడు. **'త్వక్'** అంటే చర్మం, **"స్థా"** అంటే వుండునది అని అర్థం. కనుక యీ చర్మంలోనే వుండి దానిని ప్రకాశింప చేసేది ఆ జగన్మాతే కనుక, ఆమెయే తన బాధని దూరం చేయాలని, తమ భార్యామణితో **"ఓం ఐం హ్రీం శ్రీం త్వక్‌స్థాయైనమః"** అని జపం చేయించి, ఆ తీర్థాన్ని తాను స్వీకరించాడు. ఆయన శరీర బాధలన్నీ మటుమాయ మయిపోయి, ఏడు రోజులలో మానవలసిన పుండు ఒకటిన్నర రోజులలోనే మానిపోయి, డాక్టర్లని సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తింది.

కొన్ని రోజుల తరువాత, విరిగిన ఎముకలకి, ఎముకల డాక్టర్లు ఆపరేషన్ చేసి, ఆరునెలలు కదలకుండా వుండాలని అతనిని

శాసించారు. అప్పడాయన, 'ఇంతవరకూ రక్షించిన అమ్మే, నన్ను రక్షించుకుంటుంది' అనే విశ్వాసంతో, అమ్మ నామాలలోని, **'అస్థిసంస్థితాయైనమః'** అనే నామాన్ని నిష్ఠతో జపం చేసేసరికి, నెలా పదిహేను రోజుల్లోనే స్వస్థత చేకూరింది. డాక్టర్లు మళ్ళీ ఆశ్చర్యపోయారు.

ఆయనకి 'బలం' చేకూరడానికి డాక్టర్లు మొలకెత్తిన పెసలు తినమంటే, ఆయన ఆ పెసలతో బాటూ, అమ్మ నామమైన **'ముద్గౌదనాసక్త చిత్తాయై నమః'** అనే నామజపంతో సేవించి, అత్యంత బలాన్ని సంపాదించాడు.

కనుక, **సర్వ రోగహరిణి - జగన్మాత**. మన మనస్సు నందు పరిపూర్ణ విశ్వాసం కలిగివుండి, ఆమె నామాలని జపించాలే గాని, భవరోగాలనే హరించే ఆవిడకి, యీ శారీరక రోగాలని హరించడం ఒక లెక్కా?

అట్టి సర్వ శక్తిమంతురాలయిన జగన్మాతని సేవించుకోడానికి, యీ నవరాత్రులు మనకి ప్రసాదించారు కనుక, సర్వులూ ఆ జగజ్జననిని సర్వేంద్రియ సమర్పణంగా సేవించి తరింతురు గాక!" అని శ్రీ మాతాజీ సర్వులనూ ఆశీర్వదించారు.

**ప్రేమాస్పదురాలైన తల్లి చెప్పేదాకా తండ్రి ఎవరో తెలియదు. కంటికి కనిపిస్తూ, పోషిస్తున్నప్పటికీ తల్లి చెప్పిన తరువాతే ఆయన తండ్రి అనే విశ్వాసం అంకురిస్తుంది. అప్పుడే ఆయన పట్ల గౌరవాన్ని, భయ భక్తులను వ్యక్తం చేయడం మొదలవుతుంది. తల్లి చెప్పకపోతే తండ్రి ఎవరో ఎలా తెలుస్తుంది? కంటికి కనిపించే తండ్రి గురించి తల్లి చెబితే గాని యదార్థ జ్ఞానం కలుగదు. అటువంటప్పుడు కనులకు కానరాని లోక జనకుడు, సృష్టికర్త, సర్వవ్యాపియైన ఆ పరమాత్మ గురించి అసలైన జ్ఞానాన్ని మనకు ఎవరు అందిస్తారు? ఇంకెవరు? చీకటి నుంచి వెలుగు వైపుకు నడిపించే సద్గురువే మనకు భగవత్సంబంధమైన జ్ఞానాన్ని సుబోధకం చేస్తాడు.**

- శ్రీ బాబూజీ మహరాజ్

# బాల కృష్ణుడు – బాబు

- పాలూరి కాళీప్రసాద్

(గత సంచిక తరువాయి)

గోపికలు బాలకృష్ణుని కోసం వీధి గుమ్మంలో ఎదురుచూస్తూ ఉంటే ఆయన దొడ్డిగుమ్మం నుంచి దొంగచాటుగా వచ్చినట్లు ఒకసారి శ్రీబాబు పాందువ్వ గ్రామంలో ఏర్పాటు చేసిన సత్సంగానికి రాజమార్గంలో వెళ్ళకుండా దారిలో ఉన్న ఇళ్ళలో ఒక ఇంటి దొడ్డిలో నుండి మరొక ఇంటి దొడ్డి గుమ్మం లోనికి ఇలా నడుచుకుంటూ వెళ్ళారు.

నందుడు మొదలుగా గల గోపాలురు అందరూ ప్రతి సంవత్సరం మంచి వర్షాలు పడి పంటలు బాగా పండాలని ఇంద్రయాగం చేసేవారు. కానీ బాలకృష్ణుడు మనిషి సుఖదుఃఖాలకు అతడు చేసే కర్మమే కారణం కానీ ఇంద్రాది దేవతలు కాదని, ఇంద్రుని పూజించడం కంటే వారి గోవులకు గడ్డిని అందిస్తున్న గోవర్ధన గిరిని పూజించడం ఉత్తమమని బోధించి ఆచరింపజేశాడు.

అలాగే శ్రీబాబు బ్రహ్మకపాలంలో పితృదేవతలకు పిండప్రదానం చేయ సంకల్పించిన భీమవరం తాతయ్యగారికి ఆ పిండాలు అక్కడి పండాల బ్రతుకుతెరువు కోసమేనని, అవి పితృదేవతలకు ఖచ్చితంగా చేరతాయని వారుకూడా చెప్పలేరని ఆ పండాలతోనే నిరూపింపజేసి మాన్పించారు. సాటి మనిషిని మనిషిగా గుర్తించి భక్తితో చేసుకొన్న మానవసేవే మాధవునికి నిజంగా చేరుతుందని బోధించారు. అప్పటివరకు తమ పొలంలో పనిచేసే మహంకాళి అనే హరిజనుని తమ ఇంటి ఛాయలకు కూడా రానీయని తాతయ్యగారు ఒకనాడు అతనిని ఇంటి లోపలకు పిలిచి తమ ప్రక్కన కూర్చుండబెట్టుకొని భోజనం చేయిస్తే శ్రీబాబు ఎంతగానో సంతోషించారు. అలాగే ఆ కుటుంబం, ఇంకా శ్రీవారిని ఆశ్రయించిన ఎన్నో కుటుంబాలలో అప్పట్లో ఉన్న మడి, ఆచారాలను, అంటరాని తనాన్ని రూపుమాపి సృష్టి అంతా జగన్మాత సంతానమే అని, ఇందులో తారతమ్యాలు చూడరాదని నేర్పించి వారిలో గొప్ప మార్పును తీసుకొచ్చారు.

అలాగే తమ ఆత్మరక్షణ కోసం శూలినీ దుర్గ ఉపాసన చేసి శక్తులను పొందాలని ప్రయత్నిస్తున్న శ్రీ పరిమి సుబ్రహ్మణ్య భాగవతార్ గారిని వారించి, ఆయన రక్షణ భారం అంతా తామే వహించి వారిని

ఆధ్యాత్మిక పథంలో నడిపించారు. చిన్న వయసులోనే ఇంటిని విడిచి హిమాలయాలకు వెళ్ళిపోయిన శ్రీ వితాల కామయ్య శాస్త్రిగారికి వృద్ధ తాపసి రూపంలో దర్శనమిచ్చి గృహస్థుగా ఉంటూనే తరించవచ్చని, అదే నిరపాయమైన మార్గమని ఉద్బోధించి వెనక్కి పంపించారు. వారు వివాహితులై, సంతానాన్ని పొందిన చాలా సంవత్సరాల తరువాత బాలబాబు రూపంలో మళ్ళీ దర్శనమిచ్చి ఆ రోజు తాము సూచించిన మార్గంలో ప్రయాణం ఎంత చక్కగా సాగుతున్నదో, ఆయన ఆధ్యాత్మిక సాధనలో పురోగతి ఎలా ఉన్నదో అడిగి తెలుసుకొని వారి కుటుంబాన్ని తమ శిష్యులుగా అనుగ్రహించారు.

ఇంద్ర గర్వభంగం కోసం బాలకృష్ణుడు ఏడు రోజుల పాటు వర్షాన్ని కురవనిచ్చి, అయినా తనను ఆశ్రయించిన వారికి ఎట్టి ఇబ్బంది లేకుండా గోవర్ధన గిరినెత్తి ఆ నీడలో వారిని కాపాడాడు కదా! అలాగే ఒకసారి శ్రీబాబు భీమవరం తాతయ్యగారు, ఇంకా మిగిలిన భక్తులతో కాకరపర్రు నుండి ర్యాలీ వెళుతుంటే ఒకప్రక్క తాతయ్యగారు ఆ ఎండకు తట్టుకోలేక విలవిలలాడుతున్నారు. మరొకప్రక్క ఆ చుట్టుప్రక్కల పొలాలలోని రైతులు శ్రీబాబును చూసి 'బాబూ! ఈ సంవత్సరం ఇంతవరకూ వర్షాలు లేవు. పంటలు ఎండిపోతున్నాయ్. దయచేసి వర్షం కురిపించండి' అని ఆర్తితో ప్రార్థించారు. శ్రీబాబు 'అలాగే! అలాగే!' అని అభయమిచ్చి, 'తాతయ్యా! ఎండ తట్టుకోలేక పోతున్నావా?' అని ఆకాశం వంక చూశారు. వెంటనే ఆకాశంలో మబ్బులు పట్టి వాతావరణం చల్లబడింది. వీరందరూ తిరిగి కాకరపర్రులో తమ బసకు చేరుకోగానే కుంభవృష్టి మొదలై ఆ చుట్టుప్రక్కల గ్రామాలన్నింటిలో వారంరోజులు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది.

మరొకసారి శ్రీకాళీవనాశ్రమంలో కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేశారు. ఉన్నట్లుండి ఆకాశం మేఘావృతమై అంతా చీకటిగా మారిపోయింది. భక్తులు భయపడుతుంటే శ్రీబాబు 'ఏం పరవాలేదు. మీరు భోజనాలు కానివ్వండి' అన్నారు. భక్తులు భోజనాలు చేస్తున్నంత సేపూ ఆశ్రమం కంచెకు అవతల కుంభవృష్టి కురిసింది కానీ, భక్తులమీద ఒక్క చుక్కైనా వాన పడలేదు.

బ్రహ్మదేవుడు గోప బాలురను, ఆవు దూడలను దాచివేస్తే బాలకృష్ణుడు సంవత్సరం పాటు వారందరి రూపాలు ధరించి వ్యవహారం నడిపినట్లు శ్రీబాబు బ్రహ్మరాక్షసి బాధతో మరణదశకు చేరుకున్న కుమారి పావులూరి ఇందిరాదేవి గారిలో ప్రవేశించి వారి రూపంలో ఎంతోకాలం పాటు లెక్చరరుగా ఉద్యోగం చేశారు.

రాజమండ్రి పేపరు ఫాక్టరీలో ఉద్యోగానికి వెళ్ళకుండా తమ దర్శనానికి వచ్చిన రెడ్డి కాశీప్రసాదును కాపాడటానికి అతని రూపంలో ఫాక్టరీకి వెళ్ళి ఎన్నాళ్ళుగానో బాగవ్వని యంత్రాన్ని బాగుచేశారు.

శ్రీ గుండు నారాయణగారిని, వారి సోదరులు దీక్షితులు గారిని సంవత్సరం పాటు ఆశ్రమంలోనే ఉంచివేసినా, వారి వారి ఉద్యోగ స్థానాలలో ఎవరికీ వీరు లేని లోటే తెలియకుండా చూశారు.

శ్రీకృష్ణుడు ఒక్కొక్క గోపికకు తాను ఒక్కొక్కడై అందరికీ కనువిందు చేశాడు. అలాగే శ్రీబాబు నరసాపురంలో మోహన్ లెనిన్ గారికి, ఏలూరులో ఆయన భార్య వేణమ్మ గారికి ఒకేసారి దర్శనమిచ్చి వారితో, ఇంకా ఆయా గ్రామాలలోని భక్తులతో ఒకేసారి దీపావళి జరుపుకున్నారు. ఇంకొకసారి గుండుగొలనులో శ్రీ దేవి శరన్నవరాత్రులు జరుపుతూనే మొదటి మూడు రోజులు భీమవరంలో తాతయ్యగారి ఇంటిలో కూడా వారితో కలిసి ఉన్నారు. కుమారి ఇందిరాదేవికి తాతయ్యగారి ఇంటిలోనూ, బయటి బాత్రూము దగ్గరా ఒకేసారి దర్శనమిచ్చారు. శ్రీ లలితానంద సరస్వతీ స్వామిని వారికి, ఇందిరాదేవికి, చంపకి అక్కకు బాలకృష్ణునిగా తమ చుట్టూ వివిధ ఆకృతులలో ఒకేసారి దర్శనమిచ్చారు.

దిరుసుమర్రుకు చెందిన కొందరు ఆకతాయి యువకులు తమను అవమానించాలని ఎంతకాలంగానో ఎదురు చూస్తుంటే వారికి భీమవరంలో దర్శనమిచ్చి, వారితోపాటు మిలిటరీ హొటలుకు వెళ్ళి, వారు పెట్టిన పదార్థాన్ని నిర్వికారంగా భుజించి, వారి ఎదుటే రైలు ఎక్కి వెళ్ళిపోయిన శ్రీబాబు ఆ యువకులు ఈ విషయం చెబుదామని దిరుసుమర్రు పరిగెత్తి కరణంగారు శ్రీ చాగంటి లింగమూర్తి గారి ఇంటి తలుపులు తడితే ఎదురుగా శ్రీబాబు! ఆరోజు ప్రొద్దున నుండీ శ్రీబాబు అక్కడే వారితో సంభాషిస్తూ భగవంతుని సర్వ వ్యాపకత్వం గురించి

బోధిస్తున్నారని, కనీసం లఘుశంకకు కూడా లేవలేదని తెలుసుకొని ఆ యువకులకి కనువిప్పు కలిగింది. ఇలా శ్రీబాబు ఒకే సమయంలో వేరువేరు ప్రదేశాలలో భక్తులకు దర్శనమిచ్చిన సందర్భాలు కోకొల్లలు.

అర్ఘ్యం ఇవ్వడానికి యమునలో దిగిన అక్రూరునికి శ్రీకృష్ణుడు శేషశాయి అయిన నారాయణుడిగా దర్శనమిచ్చినట్లే నదీ, సముద్ర స్నానాలలో ఎందరో భక్తులకు శ్రీబాబు శేషశాయిగా దివ్య దర్శనాన్ని అనుగ్రహించారు.

తన భక్తుడైన అర్జునుని కాపాడటానికి శ్రీకృష్ణుడు రథసారధ్యం తానే చేసినట్లు శ్రీబాబు తమ భక్తులను ప్రమాదంనుండి కాపాడటానికి అనేకమార్లు కారు డ్రైవింగ్ తామే చేసి ఆ ప్రమాదాన్ని తమపైకే తీసుకున్నారు.

ఇలా శ్రీబాబు లీలలు అనంతం. ఒక్క శ్రీకృష్ణుడనే ఏమిటి, ఏ దేవునితో పోల్చి చూసుకున్నా ఆ దేవునిలో శ్రీబాబు, శ్రీబాబులో ఆ దైవము తప్పక దర్శనమిస్తారు. ఎందుకంటే రూపాలు వేరైనా ఉన్న వస్తువు ఒక్కటే. అది మనం గుర్తించాలనే పరమాత్మ మాటిమాటికీ ఇన్నిన్ని అవతారాలు ఎత్తి మనకోసం ఇంతగా శ్రమపడుతున్నాడు. ఆ విషయాన్ని గుర్తించి, సన్మార్గంలో నడిచి, మన సాధనను పురోగమింపజేసుకొని, ఆ పరమాత్మలో లయం కావటమే వారి శ్రమకు మన వంతుగా తీర్చుకోగలిగిన ఋణం.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***సెప్టెంబర్ 2025 :*** AS 0103, 0104

***అక్టోబర్ 2025 :*** AS 2231, 6750, 6867, 7183, 7908, 8327, 8363, 9260, 9290, PK 0105, 0106

# దత్తాత్రేయుడు

(గత సంచిక తరువాయి)

- సన్నిధానం కాళీమాత

శరీరం సంపదలు శాశ్వతం కాదు. పురుషుడై పుట్టినాక మోక్షమందు కోరిక గలిగిన జన్మమే జన్మము. దానికి సత్సంగమే ఒక మార్గము. సమస్తమైన తపస్సులు మోక్షసాధకునికి సత్సంగం ద్వారానే లభిస్తాయి. తల్లి మదాలస ద్వారా అటువంటి బోధలతో పెరిగిన అలర్కుడు, మహీపతి అయినా, తన తండ్రి కువలయాశ్యునితో తన దృఢ నిశ్చయాన్ని తెలిపాడు. తమ రాజ్యాన్ని వదలి విరాగియై, సత్సాంగత్యం కోసం, మహాత్ములను, వారి అనుగ్రహానికై వెతుకుతూ తిరుగుతున్నాడు.

ఆయనకు ఒక అన్నగారు వున్నాడు. ఆయన మనస్సులో ఏమి ఆలోచన వున్నదోగాని, ఆయన కాశీరాజు దగ్గరకు వెళ్ళి, తన తమ్ముడు అలర్కుడనేవాడు, తన రాజ్యాన్ని అపహరించి అడవిలో తిరుగుతున్నాడని, తన రాజ్యం తనకు అప్పగించ వలసినదిగా వేడుకున్నాడు. 'అలాగే' అని కాశీరాజు సైన్యంతో అడవిలో తిరుగుతున్న అలర్కుడిని వెంబడించాడు. అప్పుడు అలర్కుడు భయంతో దత్తాత్రేయుని ఆశ్రమం వెతికి, ఆయన సన్నిధికి వెళ్ళి, రక్షించమని పాదాలపై పడి వేడుకున్నాడు.

దత్తాత్రేయుడు ఆయనకు ఇలా బోధ చేశాడు. 'వివేక హీనుడా! ముందు నిన్ను నువ్వు తెలుసుకో! ఇంద్రియ లక్షణాలు బుద్ధితో విచారించి తెలుసుకో. నీ లోపల ఏ అంగములు లేకుండా, అంతర్యామిగా వున్న పరమాత్మ వస్తువు వుందని తెలుసుకో. ఇంద్రియములతో అసంగుడవై, సర్వాంగముల యొక్క లక్షణములు తెలుసుకో' అని తత్వజ్ఞానాన్ని ఉపదేశించాడు.

తనకు అన్నగారి వలన ఎటువంటి ప్రమాదము లేదని దత్తాత్రేయుని ద్వారా తెలుసుకున్న అలర్కుడు స్వామికి వందన సహస్రం చేసి, తనకు సుస్థిర జ్ఞానాన్ని ప్రసాదించమని వేడుకున్నాడు. అప్పుడు స్వామి .....'**మమ**' అనటం దుఃఖానికి, '**న మమ**' అనటం నివృత్తికి మార్గాలు. కర్మలు దుఃఖానికి హేతువులు. అహంకారం అనే బీజం నుంచే మమకారం అనే అంకురార్పణ జరిగి, గృహము, క్షేత్రము, అనే కొమ్మలు పెరిగి, భార్యా, కూతురు అనే చిగుళ్ళు వేసి, ధనము, ధాన్యము అనే పెద్ద ఆకులు పెరిగి, పాప పుణ్యాలు అనే పూలు పూసి, సుఖ దుఃఖాలు అనే పండ్లు కాసి, చిరకాలం పెరిగి, అజ్ఞానమనే కుదుళ్ళతో నిండి, ముక్తి మార్గాన్ని కప్పేసేటటువంటి ఈ 'మమ' అనే వృక్షపు నీడను ఆశ్రయించి మిథ్యా సుఖ అజ్ఞానులై, ఈ సుఖాలకి ఆధీనులై వుండేటటువంటి వారికి పరమపదం అనగా మోక్షం దుర్లభం. నీవు ఆ మహా వృక్షాన్ని నిర్మలమైన విద్య, సత్యజ్ఞానమనే గొడ్డలితో ఛేదించుకో. తత్వనిధులైన సాధుజనుల సంగం పెట్టుకో. అది

పాషాణం వలే వుండి, విమల విద్య అనే గొడ్డలి పదును పెట్టుకోవడానికి, ఆ మహా వృక్షాన్ని ఛేదించుకోవడానికి, నాశనం చేయడానికి అక్కరకు వస్తుంది. నీవు అప్పుడు పునరావృత్తి లేని స్థితిని అంటే మళ్ళీ జన్మలేని స్థితిని సంపాదించుకుంటావు' అని సంసారం యొక్క బంధక లక్షణాలని బోధించాడు దత్తాత్రేయుడు.

అప్పుడు అలర్కుడు 'నేను నిర్గుణమైన బ్రహ్మైక్యత్వం ఎలా పొందగలను వివరించ'మని అడిగాడు. అప్పుడు స్వామి ఇలా చెప్పారు....

'శరీరము నందలి పరమ జ్ఞానానికి, గురువే ఉపద్రష్ట. యోగము మోక్షానికి జ్ఞాన పూర్వం అవుతుంది. ప్రకృతి గుణములతో ఏకత్వం లేకపోవడం, బ్రహ్మైక్యత్వం కలగటం లేదా ముక్తి అనవచ్చు. ఆ ముక్తి పరమ యోగంతో కలుగుతుంది. యోగం, సంగ త్యాగం వలన కలుగుతుంది. సంగ త్యాగం వలన నిర్మమత్వం, దాని వలన వైరాగ్యం, దాని వలన జ్ఞానం, దానివలన మోక్షం కలుగుతాయి. ఇంద్రియ నిగ్రహం వలన తనను తాను జయించి ఆత్మను తెలుసుకోవాలి. ఆత్మకు దేహ సంగమం వలన వచ్చినటువంటి దోషములు, ప్రాణాయామము చేత దహించాలి. అది ప్రాణాయామం చేత సులభ సాధ్యం.

కామాన్ని వృద్ధి చేసే కర్మలు, యోగాన్ని విఘ్నం చేసేవి అని తెలుసుకుని కామ్య కర్మలు విడనాడాలి. అటువంటి సాధకునికి గౌరవం విషంగా, అవమానం అమృతంగా వుంటుంది. తాను వున్న చోటే తన ఇల్లుగా, తనకు దొరికినదే భోజనంగా, వున్నదే ధనంగా వుంటూ, నిరహంకారిగా, నిర్విచారంగా యోగ బుద్ధితో మోక్షాన్ని అనుభవించ గలవు' అని బోధించాడు.

తన ధర్మాన్ని వదలి అడవులకు వచ్చిన అలర్కుడు, జ్ఞానియై, తిరిగి తన రాజ్యాన్ని చేరి, సింహాసనాన్ని అధిష్టించి తన రాజ్యాన్ని తిరిగి కాశీరాజుకు సంతోషంగా ధారపోశాడు. అలర్కుడి అన్నగారు కాశీరాజుతో 'నేను నీకు అబద్ధం చెప్పాను. నా సోదరుడికి జ్ఞాన ప్రబోధం జరగాలని అలా చేశాను. నాకీ రాజ్యం అక్కర్లేదు అని కాశీరాజుకు జ్ఞానబోధ చేసి, తత్వోపదేశం చేసి, తన ఆశ్రమానికి వెళ్ళిపోతాడు.

ఆయన జ్ఞాని. అలర్కుడు కాశీరాజు చేత తరమబడి, దత్తాత్రేయుని చేరి, ప్రబోధం పొందటం కోసం అలర్కుడి అన్నగారు చేసిన పని. వారు వారి పేరును కూడా తెలియనివ్వ లేదు. కేవలం అలర్కుని అన్నగా మాత్రమే తెలుసు. కాశీరాజు రాజ్యాన్ని తిరిగి అలర్కునికి అప్పజెప్పగా, అలర్కుడు తన పుత్రునికి పట్టాభిషేకం చేసి, తాను అరణ్యానికి వెళ్ళి, యోగియై, విరాగియై, తపోధనుడై ఆత్మ సుఖం పొందాడు. మార్కండేయ పురాణంలో వున్న కథ ఇది.

దత్తాత్రేయుడు విచిత్ర చరిత్రుడు. కుక్కలు వెంటరాగా, విల్లంబులు పట్టుకుని, చండాలుడి వేషంతో, మద్య మాంసాలు సేవించే వాడిలాగా, ఉన్మత్తుడిలాగ, పల్లెలలో తిరిగేవాడు. కాని ఆయన మహా యోగీశ్వరేశ్వరుడు. సాధకులు తమ సత్వర అభివృద్ధికి దత్తాత్రేయ మంత్రాన్ని జపిస్తారు.

(–మహా మహోపాధ్యాయ డా॥శ్రీకందుకూరి శివానందమూర్తిగారి 'మార్గ దర్శకులు మహర్షులు' అనే పుస్తకం నుండి గ్రహించ బడినది.)

**"ఒకామెకు 25మంది సంతానం ఉన్నారు. 15మంది ఆడపిల్లలు, 10మంది మగసంతానం. వారికి ఇంతమంది అల్లుళ్ళు, కోడళ్ళు కావలసినదే కదా! దానితో సతమతమవుతూ ఉండేవారు.**

**కబీరుదాసు సగుణ నిర్గుణబ్రహ్మ కాని పరబ్రహ్మతత్త్వాన్ని కనుగొని ఆ స్వరూపమే తాను అయినట్టి మహానుభావుడు. ఆయన ఒకసారి ఆమె ఇంటి ముందుగా వెడుతూ పిండి విసురుతున్న ఆమెను చూసి అలానే చూస్తూ నిలిచి పోయాడు. తారక నామమే ఊటగా దాహం తీర్చుకునే మహాత్ముడు ఆయన. ఈ ఊటని జన్మజన్మాంతర దాహం తీర్చే తీర్థం అంటారు. కబీర్‌కు ఆమె పిండి విసురుకుంటుంటే జాలివేసింది. 'అహంకార మమకారమనే తిరగలిలో పిండిపిండైపోతున్నారు మానవులు. మధ్యలో బురుజుని (గురువును) ఆశ్రయించి ఉన్నవాడు తరిస్తాడు. ఆ బురుజును పరమాత్మ తత్వంగా గ్రహించాలి. ఆ మానవులే పిండి అవుతున్న బియ్యం' అని కబీర్ కన్నీరు కార్చటం చూసి ఆమె ఆశ్చర్యంగా 'ఎందుకు స్వామీ అలా దుఃఖిస్తున్నారు?' అని ప్రశ్నించింది. దానికి సమాధానంగా కబీర్ 'అమ్మా! నారాయణుని స్మరిస్తూ గురువును ఆశ్రయించిన వారికి నాశనం వుండదు' అని ఉపదేశించారు. అంతమంది సంతానం కలిగినదైనప్పటికీ ఆమె భక్తి స్థిరమైనది. ఆ స్వామి చెప్పినది లక్ష్యార్థంగా భావించి, ఎంతమంది పిలిచినా వినకుండా, తదేక దృష్టితో నారాయణ స్మరణ చేస్తూ, ఆ మంత్రస్వరూపమే తానైపోయింది. అంతటి తీవ్రత ప్రతివారికీ అత్యవసరం!!"**

- శ్రీ కాళీబాబు

# భగవద్గీత సాధన దీపిక

(గత సంచిక తరువాయి) - కీ.శే. శ్రీ గూడా శివ రామమూర్తి

దానికేదైనా అఘాతం కలిగితే సంసారాసక్తి శోకంగా మారుతుంది. దాని మూలంగా సాధకుడు తన మార్గాన్ని కోలుపోతాడు. ఒకవేళ అది ఫలించితే, ఆ ఆసక్తి సంతోషంగా మారుతుంది. దీని వలన సాధకుడు తన లక్ష్యాన్ని మరచిపోవటం గాని, మార్గం తప్పటం గాని జరుగుతుంది. రెండు విధాలా సాధకుడికి నష్టమే కలుగుతుంది. నీలో ఆసక్తి ఉంటే నీ బుద్ధి మోహంలో పడుతుంది. లేదా కలుషితం అయి మబ్బులు పట్టిన ఆకాశంలాగ అవుతుంది. అంతేకాని పూర్తిగా నాశనము మాత్రం కాదు. శ్రవణ,



మనన, నిదిధ్యాసనముల ద్వారా అజ్ఞానాన్ని పోగొట్టుకొని, ఆత్మానుభూతిని పొందే శక్తిని అది ఎన్నడూ పోగొట్టుకోదు. అందువలన, నీవు గురుదేవుని బోధామృతాన్ని గ్రోలే అవకాశాన్ని ఏ పరిస్థితులలోను పోగొట్టుకోకూడదు.

**8. నహి ప్రపశ్యామి మమాపనుద్యాద్యచ్ఛోక ముచ్ఛోషణ మింద్రియాణాం**
**అవాప్య భూమావసపత్నమృద్ధం రాజ్యం సురాణామపి చాధిపత్యం ॥**

**సంజయ ఉవాచ:**

**9. ఏవ ముక్త్వా హృషీకేశం గుడాకేశః పరంతపః**
**నయోత్స్య ఇతి గోవింద ముక్త్వా తూష్ణీం బభూవ హ ॥**

**10. తమువాచ హృషీకేశః ప్రహసన్నివ భారత!**
**సేనయోరుభయోర్మధ్యే విషీదంత మిదం వచః ॥**

"కృష్ణా! నాకు కలిగిన ఈ శోకాన్ని తక్కువగా అంచనా వేయవద్దు. ఈ దుఃఖము నా ఇంద్రియముల నన్నింటిని దహించి వేస్తున్నది. శత్రువులే లేని నిష్కంటకమైన ఏకచ్ఛత్రాధిపత్యం ఈ భూమి అంతటిపైనా నాకు లభించినా, నా పంచేంద్రియములను శోషింప చేస్తున్న ఈ శోకానికి పరిహారం మాత్రం కలిగేటట్లు లేదు. దయచేసి దీనినుండి బయటపడే మార్గం చూపించు. గోవిందా! ఇకనేను యుద్ధం చేయను" అని అర్జునుడు మాట్లాడటం ఆపి మౌనం వహించాడు.

శ్రీకృష్ణ భగవానుడు నగుమోముతో ఉభయ సైన్యముల మధ్య దుఃఖిస్తూ కూర్చున్న అర్జునుణ్ణి చూశాడు. శ్రీకృష్ణ భగవానుని మనస్సు నిర్మలంగా ఉన్నది. ఏది సత్యం? ఏది అసత్యం? ఏది నిత్యం? ఏది అనిత్యం? అనేవి తెలిసినవాడు అవటం చేత సర్వేంద్రియాలకు ప్రభువు అయిన శ్రీకృష్ణ భగవానుడు మొదటి నుండీ స్థైర్యచిత్తంతోనే ఉన్నాడు.

కొందరు ఆధ్యాత్మికత మానవుణ్ణి బాధలనుండి తప్పించుకొని పారిపోయే స్వభావం గలవాణ్ణిగా, వాస్తవ జీవితంలోని ఒడిదుడుకులకు తట్టుకోలేక పారిపోయే పలాయన వాదిగా మార్చి వేస్తుందని ఆక్షేపిస్తారు. కాని అది నిజంకాదు. అర్జునుడి జీవితాన్నే పరిశీలించి చూస్తే మనకు సత్యం బోధపడుతుంది. అర్జునుడిలో ఆధ్యాత్మికత ఉన్నది. కాని అది అజ్ఞానజనితమైన మోహంతో కప్పబడింది. ఆధ్యాత్మిక దృష్టి మోహంతో కప్పబడినప్పుడు మాత్రమే అర్జునుడు యుద్ధం చేయలేనని అన్నాడు. కాని శ్రీకృష్ణ భగవానుడి విషయంలో అలాకాదు. ఆయన ఆధ్యాత్మిక దృష్టి ఎన్నడూ మోహకలితం కాలేదు. అందువలననే, ఆయన స్థిరంగా, చిరునవ్వుతో, గీతామృతాన్ని స్వీకరించటానికి పాత్రుడు అయిన అర్జునుడికి బోధామృతాన్ని అందించటానికి సిద్ధమైనాడు.

అర్జునుడు సాధకులందరికి ప్రతీక. నీలో కూడ ఒక వైపు ఆత్మానుభూతికై ఆకాంక్ష, మరొకవైపున సంసారాసక్తీ రెండూ ఉన్నాయి. ఈ ఆసక్తి ఎప్పుడు ఏ విధంగా ప్రకటనం అవుతుందో, నీవు తెలుసుకోలేవు. కాని దానికి ఆటంకం కలిగితే మాత్రం అది శోకంగా బహిర్గతం అవుతుంది. లేదా అది ఫలిస్తే, సంతోషం ప్రకటనం అవుతుంది. అప్పుడు నీవు నీ లక్ష్యాన్ని విస్మరించటమో, లేదా దారి తప్పటమో జరుగుతుంది. నీ కోరికలు ఫలించి, నీకు పేరుప్రతిష్ఠలు, ఇహలోక సంపదలు, సుఖభోగాలు లభించినప్పుడు, నీలోని ఆసక్తి కారణంగా మనస్సు వీటిచేత ఆకర్షింపబడి భగవంతుణ్ణి మరచి పోతుంది. ఆ ఆసక్తి వల్ల చివరకు నీవు స్వార్థ పూరితుడవుగా తయారవుతావు.

శ్రీకృష్ణ భగవానుడు, అర్జునుడికి ఈ సమస్య అతడి ఆధ్యాత్మిక దృష్టిలోపం వల్ల ఉత్పన్నం అయింది అనీ, అతనిలోని ఆసక్తికి మూలం అహంకార మమకారాలు అనీ తెలిసినవాడు కనుక, అర్జునుడికి అహంకార మమకారాలను గురించిన జ్ఞానదృష్టిని ప్రసాదించాడు.

- సశేషం

# శ్రీ మాతాజీ ఐరోపా పర్యటన విశేషాలు

- భాగవతుల హనుమత్ జయప్రద

శ్రీ మాతాజీ ఐరోపా ఖండములో ఉన్న భక్తులను అనుగ్రహించడానికి, జులై 21 మొదలుకుని, ఆగష్టు 12 వరకు వివిధ దేశాలలో పర్యటించడం జరిగింది. ఈ పర్యటన యొక్క ముఖ్య విశేషాలని ఇక్కడ ప్రచురిస్తున్నాము.

జులై 21- శ్రీ మాతాజీవారు చికాగో (అమెరికా) నుండి ఫ్రాంక్ఫర్ట్ (జర్మనీ)లోని భాగవతుల శ్రీరామ్, హనుమత్ జయప్రద దంపతుల గృహానికి చేరుకున్నారు.

జులై 23 -శ్రీ మాతాజీ వారు, మాస శివరాత్రి సందర్భముగా, శ్రీరామ్ కుమార్ దంపతులచేత మహన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు.

సాయంత్రం శ్రీ మాతాజీ భక్తులతో కలిసి, శ్రీ పరమహంస విశ్వానంద ఆశ్రమము(భక్తి మార్గ -శ్రీ పీఠ నిలయం)ను సందర్శించారు. అక్కడ ఆలయాల విశేషాలని శ్రీ స్వామి పరమహంస విశ్వానంద వారు శ్రీ మాతాజీకి, ఇతర భక్తులకి సవివరంగా అందించారు. ఆ తర్వాత శ్రీ మాతాజీ తమ యొక్క దివ్య సందేశాన్ని భక్తులకి అందించారు. విదేశీభక్తులు అనేకులు అమ్మని దర్శించి, సంభాషించి, ఎంతో ఆనందానుభూతులకి లోనయ్యారు.

జులై 24-శ్రీరాంకుమార్ వారి గృహానికి శ్రీ పరమహంస విశ్వానందస్వామి వారు తమ భక్తులతో విచ్చేసారు. శ్రీ మాతాజీ శ్రీరాంకుమార్ దంపతులచేత స్వామివారికి పాద పూజ చేయించారు. అనంతరం సంకీర్తన, భక్త సమారాధన జరిగింది.

జులై 25-మొదటి శ్రావణ శుక్రవారం సందర్భముగా, శ్రీలలితా సహస్రనామ సహిత వరలక్ష్మీ వ్రతాన్ని శ్రీ మాతాజీ వారు శ్రీరాంకుమార్ దంపతుల చేత చేయించారు. అనంతరం భక్త సమారాధన జరిగినది.

జులై 26-శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ, శ్రీ భగవద్గీత పారాయణ, శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ (11 సార్లు) జరిగినవి. భక్తులు అందరు ఈ పారాయణలలో పాల్గొని, దివ్యమైన అమ్మ యొక్క సందేశాన్ని, అనంతరం తీర్థ ప్రసాదాలని స్వీకరించారు.

జులై 27- శ్రీ మాతాజీ వారు భక్తులతో కలిసి శ్రీ విఠ్ఠల్ధామ్ ఆలయాన్ని సందర్శించారు. అక్కడి భక్తులు అమ్మకు ఎంతో భక్తి శ్రద్ధలతో ఆహ్వానం పలికారు. అనంతరం, ఆలయ దేవి దేవతలని, విశేషాలని, శ్రీ మాతాజీ వారు సందర్శించారు. ఆ తర్వాత శ్రీ మాతాజీ సుమారు 2 గంటల సేపు భగవన్నామ సంకీర్తన చేశారు. శ్రీ విఠ్ఠల్ ధామ్ భక్తులు అమ్మ యొక్క దర్శనం చేసుకుని, ఎంతో ఆనందానికి లోనయ్యారు.

జులై 28 -శ్రీ మాతాజీ జర్మనీ నుండి నెదర్లాండ్స్ దేశము బయలుదేరి శ్రీ జ్ఞానేశ్వర్, మనస్విని దంపతుల గృహానికి చేరుకున్నారు. సాయంత్రం వారి ఇంట్లో సద్గురు

పాదపూజ జరిగింది. అనంతరం శ్రీ మాతాజీ తమ దివ్యబోధని అందించారు. తీర్థ ప్రసాద వితరణతో ఆరోజు ముగిసింది.

జులై 29- శ్రీలలితాసహస్రనామ పారాయణ సహిత మంగళ గౌరి వ్రతాన్ని ఆ దంపతుల చేత శ్రీ మాతాజీ చేయించారు.

జులై 30-శ్రీ ఆదిత్య, రాజ్యలక్ష్మి దంపతుల గృహానికి వెళ్ళడం జరిగింది. అక్కడ శ్రీ లలితా సహస్రనామ పారాయణ, శ్రీ ఆదిత్యహృదయ పారాయణ జరిగింది. అనంతరం అమ్మ తమ దివ్య బోధని అందించారు.

జులై 31 -శ్రీ మాతాజీ నెదర్లాండ్స్ నుండి బయలుదేరి నార్వే ( శ్రీ శేషప్రసాద్, గీతాబాల దంపతుల గృహానికి) చేరుకున్నారు. అమ్మతో పాటు ఇతర భక్తులు కూడా చేరుకున్నారు.

ఆగష్టు 1 - రెండవ శ్రావణ శుక్రవారం పూజ, వరలక్ష్మీ వ్రతం జరిగినది. అమ్మ తమ బోధామృతాన్ని వచ్చిన భక్తులకి అందించారు. అనంతరం తీర్ధ ప్రసాద వితరణ జరిగినది.

ఆగష్టు 2 - శ్రీరాకేష్ దంపతులు మరియు శేష ప్రసాద్ దంపతులు శ్రీసద్గురు పాదపూజ చేసుకున్నారు.

ఆగష్టు 6 - శ్రీ మాతాజీ ఇతర భక్తులతో కలిసి స్టవంగర్ (నార్వే దేశము) పట్టణము నుండి డెన్మార్క్ దేశములోని శ్రీ ప్రసాద్ రాజుగారు, విజయ దంపతుల గృహమునకు చేరుకున్నారు.

ఆగష్టు 8-10-త్రయాహ్నికదీక్ష-శ్రీ ప్రసాద్ రాజు, విజయ దంపతుల స్వగృహములో శ్రీ విఘ్నేశ్వర పూజతో ప్రారంభం అయినది. సాయంత్రం, వరలక్ష్మీ వ్రతాన్ని శ్రీ మాతాజీ వారు భక్తులందరి చేత చేయించి, బోధను ప్రసాదించారు. అనంతరం తీర్ధప్రసాద వితరణ జరిగినది.

ఆగష్టు 9 - స్టెంలిల్లె లోని వేల్ మురుగన్ ఆలయంలో శ్రీ గణపతి పూజ, మహన్యాసపూర్వక రుద్రాభిషేకములు, శ్రీ లలితా సహస్రనామ సహిత కుంకుమార్చన శ్రీ మాతాజీవారు సామూహికంగా చేయించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మ దర్శనం చేసుకున్నారు. అనంతరం తీర్ధ ప్రసాద వితరణ జరిగినది.

ఆగష్టు 10 - సద్గురు పాదపూజ, త్రయాహ్నిక దీక్ష విరమణ జరిగినది. అనంతరం తీర్ధ ప్రసాద వితరణ జరిగినది.

ఆగష్టు 12 - శ్రీ మాతాజీ, ఇతర భక్తులు, కోపెన్ హాగిన్ నుండి బయలుదేరి చెన్నై చేరి ఆగష్టు 13 ఉదయానికి శ్రీ కాళీవనాశ్రమం చేరుకున్నారు.

# శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారి సహస్ర నామావళిః

(గత సంచిక తరువాయి) -పాలూరి ప్రసాద్

**51. ఓం నిర్వికారాయ నమః**

శ్రీ సద్గురు దేవులు ఎటువంటి వికారములు లేనివారు. వారు మనలాగే ఉన్నా, మనతో మాట్లాడుతున్నా, ఏ పని చేస్తున్నా వారి మనస్సు ఎప్పుడూ భగవంతుని యందు – అనగా స్వస్వరూప స్థితియందు (భగవంతునికీ గురుదేవునికీ భేదం లేదు) – లీనమై వుంటుంది కాని ఎట్టి వికారములకు లోను కాదు.

**52. ఓం నిరాధారాయ నమః**

సమస్త లోకాలలో వున్న సర్వజీవకోటికి ఆధారమైయున్న జగదోద్ధారకులైన సమర్థ సద్గురు దేవులకు ఆధారము కాగల వస్తువు మరియెకటి ఎక్కడ ఉంటుంది? నిరాధారులై మనకు ఆధారముగా నిలచిన అట్టి గురుదేవులకు నమస్కరించుచున్నాను.

**53. ఓం నిస్సంగాయ నమః**

శ్రీ గురుదేవులు నిస్సంగులు – అనగా వారు శారీరకముగా ఏ కర్మలు చేస్తున్నా వారి మనస్సుకు వాటితో సంగం – అనుబంధం ఏర్పడదు. కనుక అవి కర్మలుగా కాక లీలలుగా కీర్తించబడతాయి. భగవద్గీతలో చెప్పినట్లుగా విషయాలను ధ్యానించటం వలన వాటితో సంగం ఏర్పడుతుంది కాని నిరంతరం విశ్వనాధునిలో లీనమైన మనస్సుకు దేనితోనూ సంగం ఏర్పడదు.

**54. ఓం నియత వ్రతాయ నమః**

శ్రీ గురుదేవులకు నిజానికి ఏ వ్రతంతోనూ పని లేదు. కానీ తమ శిష్యులకు ఆచరణలో చూపటానికి వారు అన్ని వ్రతాలను ఎంతో నియమ నిష్ఠలతో ఆచరిస్తారు. మనం వారిని చూచి నేర్చుకోవాలనే వారు అంత కష్టపడతారు.

**55. ఓం నిగ్రహానుగ్రహోద్దామాయ నమః**

శ్రీగురుదేవుల నిగ్రహం కాని అనుగ్రహం కాని అంతు లేనిది. త్రిమూర్తులు మనకు ప్రతికూలించినా శ్రీగురుదేవులు తమ అపార అనుగ్రహంతో మనను రక్షించగలరు. కాని అట్టి గురుదేవులకు ఆగ్రహం కలిగిస్తే ఆ త్రిమూర్తులు కూడా మనను రక్షించలేరు. కానీ వారి ఆగ్రహం మన ఉద్ధరణకే కనుక అది వెంటనే చల్లారి తిరిగి వారే మనను రక్షిస్తారు.

**56. ఓం నిర్జితారాతి దుర్మదాయ నమః**

తమ శిష్యులలో దాగియున్న కామక్రోధాది అరిషడ్వర్గములే గురుదేవులకు శత్రువులు. తమను ఆశ్రయించి శరణు కోరిన వారలకు శమదమాది షట్క సంపత్తిని ప్రసాదించి, వారికి అట్టి అరిషడ్వర్గములను సంహరించే శక్తిని ప్రసాదిస్తారు శ్రీగురుదేవులు. తమ శిష్యులలో అట్టి గుణములను నాశనం చేయటమే వారు పొందిన విజయం.

**57. ఓం నిగూఢాయ నమః**

శ్రీగురుదేవుల తత్త్వం ఎంతో లోతైనది. అది వారు తెలియచేస్తే తప్ప త్రిమూర్తులకు కూడా తెలియరానిది. తమ శిష్యులను కరుణించి తమ తత్త్వాన్ని వారే స్వయంగా బోధించవలసిందే కాని ఇతరులు చెప్పలేరు.

**58. ఓం సిద్ధ సంకల్పాయ నమః**

శ్రీ గురుదేవుల సంకల్పం అమోఘమైనది. వారు సంకల్ప మాత్రం చేతనే సృష్టి స్థితి లయములు చేయగలరు. అట్టివారు సంకల్పించిన దానిని ఎవరూ ఆపలేరు. అయితే వారి సంకల్పాలన్నీ లోక కళ్యాణార్థమే.

**59. ఓం నిష్కళంకాయ నమః**

శ్రీగురుదేవులు కళంక రహితులు. తామర పువ్వు బురదలో ఉన్నప్పటికీ దానికి ఎట్టి బురద అంటనట్లు శ్రీగురుదేవులు అందరివలెనే సంసారములో ఉన్నట్లు కనిపించినా వారిని ఈ సంసారములోని మలినములు ఏవీ అంటవు.

**60. ఓం నిరంజనాయ నమః**

నిరంతరము పరబ్రహ్మతత్త్వమునందు లగ్నమై, ఆత్మానందములో ఓలలాడుచు, తమనాశ్రయించిన వారి మనోమాలిన్యమును క్షణములో హరించి వేసి వారిని కూడ అట్టి ఆత్మానందాంబుధిలో ఓలలాడించగల సమర్థులైన శ్రీగురుదేవులను యెట్టి మలినములు అంటజాలవు.

- సశేషం

***సర్వ మతాల సారం ఒక్కటే. ఆచారాలు వేరైనా ఆంతర్యం ఒక్కటే. దారులు వేరైనా గమ్యం ఒక్కటే. అయితే భక్తి, కర్మ, జ్ఞాన మార్గాల ద్వారానే ఆధ్యాత్మిక భావబీజాలు సులువుగా అంకురిస్తాయి. సత్వర ఫలితాలనిస్తాయి.***


- శ్రీ కాళీబాబు

# శ్యామ సుందరా! ఒక్కసారి,
# ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ!

(గత సంచిక తరువాయి)

- కీ.శే. రమణ ప్రసాద్

ఉన్నట్లుండి అర్జునుడికి స్ఫురించింది. తాను ఎంత మంద భాగ్యుడు? ఇన్ని సంవత్సరాల సాహచర్యంలో ఒక్కనాడైనా ఆ శ్రీకృష్ణుని మురళీగానాన్ని వినటానికి నోచుకోలేదు. వ్రజభూమిలో, యమునాతీర సైకతములలో వెన్నెల రాత్రులలో, కదంబవృక్ష శాఖలపైన కూర్చుని లేదా కాళిందీ జలాలలో తన చిరుపాదాలను ఆడిస్తూ వేణువుపైన ఎన్నో మధురగీతాలను ఆలపించాడు ఆ మురళీమోహనుడు. కాని తాను ఎంత దురదృష్టవంతుడు! ఒక్క మధురగీతాన్నైనా వినలేదు.



ఇంద్రప్రస్థంలో కృష్ణుడు, హస్తినాపురంలో కృష్ణుడు, ద్వారకలో కృష్ణుడు....అర్జునుడు ఈ కృష్ణులందరితో సహచరుడుగా ఉన్నాడు. కాని నందవ్రజంలో గోపబాలకులతో చల్దులారగించిన కృష్ణుడు! గోపికలతో రాసలీల జరిపిన కృష్ణుడు! బృందావనంలో మ్రోడులను సైతము తన మృదు స్పర్శతో, వేణుగానంతో చిగిర్చేలా చేసిన కృష్ణుడో! ఆ బాలగోపాలుడిని తాను ఊహించనైనాలేదు. ధర్మక్షేత్రమైన కురుక్షేత్ర మైదానంలో తాను శ్రీకృష్ణుని విశ్వరూపాన్ని సందర్శించాడు. ఆ దర్శనంలో అన్ని బ్రహ్మాండాలను మహర్షులను, దేవతలను, సిద్ధ, చారణ, యక్ష, రాక్షస గంధర్వాదులను, సాగరాలను, నదీనదాలను, సమస్త జీవరాశులను దర్శించాడు. కాని ఆ మృదుల వేణునాదం మాత్రం ఎక్కడా వినిపించలేదు.

రణభూమిలో ఆ శంఖారావాల, సింహనాదాల, హయహేషల రణగొణ ధ్వనుల మధ్య ఎలా వినిపిస్తుంది? ఆ మురళీరవం వినగలిగి ఉంటే ఈ మహావినాశం ఎందుకౌతుంది? ఆ మహా వినాశనాన్ని ఆపగలిగి ఉంటే! ఇప్పుడు, 36 సంవత్సరాల తరువాత ఈ యాదవ కులం

కూడా ఉండటం లేదు. గాంధారిమాత కృష్ణుని వంశనాశనం కావాలని శాపం ఇచ్చి ఉన్నది కదా! దాని ఫలితమే ఇది!

"ధనంజయా! మన గుఱ్ఱములు ద్వారములో అడుగు పెట్టనంటున్నాయి చూడండి! చూడండి!" అని అర్జునుని ఆలోచనలకు భంగం కలిగిస్తూ అన్నాడు దారుకుడు. దారుకుడు చెప్పింది యథార్థమే. ఎప్పుడూ దారుకుని వశంలో ఉండే గుఱ్ఱాలే ఎందుకో ఈ రోజు అతని ఆజ్ఞలను ఉల్లంఘిస్తున్నాయి. గుఱ్ఱాలు సకిలిస్తూ, తమ ముందు కాళ్లను గాలిలోకి పైకెత్తి కదను తొక్కుతున్నాయి.

'దారుకా! కృష్ణవిహీనమైన ద్వారకలో నేను ఎట్లా అడుగు పెట్టనయ్యా! అసలు నేను ఆ భవనంకేసి ఎలా చూడగలను? అదే ఆ కృష్ణుడు నివసించిన భవనం. దారుకా! రథాన్ని వెనక్కు మళ్లించు' అన్నాడు అశ్రుధారల మధ్య అర్జునుడు. అర్జునుడు ఆ మాటలు అన్నాననుకున్నాడే కాని అవి నోటినుంచి బయటకు వస్తేగా? ఎందువలన అంటే ఈనాడు ఆ రథానికి పూన్చిన అశ్వాలయొక్క కళ్లాలు శ్రీకృష్ణుని చేతిలో లేవు. శ్రీకృష్ణుడు కూర్చున్న స్థానంలో ఈరోజు దారుకుడు కూర్చుని ఉన్నాడు.

"ఈ పితామహులతో! ఆచార్యులతో! సోదరులతో! మనుమలతో! అల్లుళ్లతో! స్వజనులతో!... వీరితో నేను యుద్ధం చేయను, వీళ్లతో యుద్ధం చెయ్యటం నా వల్లకాదు..." అంటూ రణభూమిలో 18 అక్షౌహిణుల సేన మధ్యలో గాండీవం జారవిడిచి కూలబడటం అనేది సులభమైన విషయమా? అయినా అది అతి సులభమైన విషయంగా అయింది. ఎందుకంటే అప్పుడు లగాము శ్రీకృష్ణుడి చేతిలో ఉంది. అవసరాన్ని బట్టి సమర్థించడానికి, సాయం చేయటానికి కృష్ణుడు ఉన్నాడు. అప్పుడు అర్జునునికి ఏ విధంగాను ఆలోచించవలసిన అవసరమే రాలేదు.

- సశేషం


# నారద భక్తి సూత్రములు

- వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

**భక్తి సూత్రము 43: దుస్సంగః సర్వథా ఏవ త్యాజ్యః**

తాత్పర్యము: దుస్సాంగత్యమును ఎల్లవిధముల త్యజింపవలయును

ముందు సూత్రములలో మహాత్ముల యొక్క సాంగత్యము వలన భగవత్కృప కలుగుతుందని వివరించిన నారదులు ఈ సూత్రము ద్వారా దుస్సాంగత్యము సాధనకు ఎంత ప్రమాదకారో తెలియచేస్తున్నారు.



శంకర భగవత్పాదుల వారు సత్సాంగత్య మహాత్మ్యమును గురించి వివరిస్తూ **"సత్సంగత్వే నిస్సంగత్వం। నిస్సంగత్వే నిర్మోహత్వం నిర్మోహత్వే నిశ్చల తత్వం। నిశ్చల తత్వే జీవన్ముక్తిః"** అని తెలిపిన జగద్విదితమైన శ్లోకములో సత్సంగము తరింపచేసే పరిణామ క్రమమును వివరించారు. అటువంటి సత్సంగమునకు మొదటి మెట్టు నిర్మలమైన మనసేనని, దానికి ప్రధానమైనది దుస్సంగమును నివారించుకోవడమే అని ఈ సూత్రము వివరిస్తోంది. ఈ సూత్రములో **"సర్వథా"** అన్న ప్రస్తావన ద్వారా అన్ని విధముల మరియు అన్నివేళలా దుస్సాంగత్యమును త్యజింప వలెను అని నారదులు నొక్కి వక్కాణిస్తున్నారు.

మరి దుస్సాంగత్యము అంటే ఏమిటి? అన్న ప్రశ్న ఉదయిస్తుంది. భగవంతుడికి ఎడబాటు కలిగించేది, లేదా భగవంతుని చేరుకొనే మార్గములో ఎటువంటి అవరోధమునైనా కలిగించేదానిని దుస్సాంగత్యముగా పరిగణించాలి. అయితే దుష్టులను త్యజింపవలసి వచ్చినప్పుడు వారిలో వున్న భగవంతుని కూడా త్యజించినట్లేనా? అన్న సందేహం కలగవచ్చు. సర్వవ్యాపకుడైన భగవానుడు త్యాజ్య గ్రహణములకు అతీతుడుగా ఉంటాడు. ద్వంద్వాతీత స్థితిలో ఉన్న స్థితప్రజ్ఞుడికి ఇవి అభేదముగా కనిపించినప్పటికీ సాధనా క్రమంలో ఉన్న సాధకుడు దుస్సాంగత్యమును త్యజింపవలసినదే. సాధకుడు దేని వృద్ధిని కోరి సాధన చేయుచున్నాడో దానికి విరోధి తత్వము నుండి దూరముగా ఉండవలసినదని నారదులు ఈ సూత్రము ద్వారా హెచ్చరిస్తున్నారు.

**భక్తి సూత్రము 44: కామ క్రోధ మోహ స్మృతి భ్రంశ బుద్ధి నాశ కారణత్వాత్**

తాత్పర్యము: కామ క్రోధ మోహములను స్మృతి భ్రంశము మరియు బుద్ధి నాశనమును కలిగించే వాటినన్నింటిని (సాధకుడు త్యజించ వలసినదే). పై సూత్రములో దుస్సాంగత్యమును త్యజింపవలసినదని తెలియజేసిన నారదులు ఈ సూత్రము ద్వారా దుస్సాంగత్యము యొక్క ప్రభావమును వివరిస్తూ దుస్సాంగత్యము కామ, క్రోధ, మోహ, స్మృతి భ్రంశ, బుద్ధి నాశనమును కలుగచేస్తుందని వివరించారు. ఈ సూత్రము మనకు భగవద్గీతలో జగద్గురువులు వివరించిన మంత్ర రాజములను గుర్తుకు తెస్తాయి

**ధ్యాయతో విషయాన్ పుంసః। సంగస్తేషూపజాయతే।**

**సంగాత్ సంజాయతే కామః। కామాత్ క్రోధోఽభిజాయతే॥**

**క్రోధాద్భవతి సమ్మోహః। సమ్మోహాత్ స్మృతివిభ్రమః।**
**స్మృతిభ్రంశాత్ బుద్ధి నాశో। బుద్ధినాశాత్ ప్రణశ్యతి॥**

పై శ్లోకాల ద్వారా జగద్గురువులు ఒక విషయమును గురించి ఆలోచించినప్పుడు దానితో ఏర్పడే సంగమును, తద్వారా జనించే కామమును, ఆ కోరిక తీరనప్పుడు వచ్చే క్రోధము, దాని తర్వాత సమ్మోహము, స్మృతి భ్రంశము, చివరికి బుద్ధినాశనమునకు దారి తీసే పరిణామ క్రమమును గురించి వివరించారు. అదే పరిణామ క్రమమును నారదుల వారు ఈ సూత్రములో దుస్సాంగత్య ఫలితముగా వివరిస్తున్నారు.

వివేక చూడామణిలో శంకర భగవత్పాదుల వారు కూడా "**విషాయాభిముఖం దృష్ట్వా విద్వాంసమపి విస్మృతిః**" – అంటూ విషయాదులు పండితులకు సైతం విస్మృతి కలిగించగలిగినవని తెలియజేస్తూ సాధకుడు నిత్య అప్రమత్తుడై ఉండాలని బోధించారు.

అయితే ఈ పరిణామ క్రమము వెనుకకు మరల్చి ఆ సంగమునే సత్య వస్తువుతో, మరియు భగవద్భక్తులతో పెట్టుకున్న నాడు ఆ సాంగత్యమే సత్సాంగత్యమై సాధకుని ఉన్నత స్థితికి తీసుకుని వెళ్ళగలుగుతుందని గ్రహించాలి. ఈ సూత్రము ద్వారా దుస్సాంగత్యం యొక్క నిర్వచనాన్ని కూడా నారదులు అందిస్తున్నారు. కామ క్రోధ మోహ స్మృతి భ్రంశ బుద్ధి నాశములను కలిగించే కారకములే దుస్సాంగత్యములనీ, వాటిని సాధకుడు అన్ని వేళలా త్యజించవలసినదని నారదులు బోధిస్తున్నారు.

**భక్తి సూత్రము 45: తరంగితా అపీమే సంగాత్ సముద్రాయంతే**

తాత్పర్యము: కామాదులు ప్రప్రథమంగా లవమాత్రములుగా ఉన్నప్పటికీ చిన్న అలలన్నీ కలసి సముద్రమైనట్టు సంగ దోషము వలన అవి ప్రబలముగా మారుతాయి.

పై సూత్రములలో దుస్సాంగత్యము వలన కలిగే దుష్ఫలితములను సాధకుడు నివారించగలగాలని సందేశము ఇచ్చిన నారదుల వారు ఈ సూత్రము ద్వారా కామ క్రోధాదుల మూల కారణము గురించి తెలియజేస్తూ అవి ప్రధమముగా చిన్న తరంగముల వలె నిద్రాణమై లవ లేశములైనప్పటికీ విషయ సాంగత్యం వలన ఆ తరంగములే వృద్ధి చెంది ఒక మహా సముద్రము వలె సాధకుని కబళించి వేయగల సామర్థ్యము కలిగినవని హెచ్చరిస్తున్నారు. గమనించవలసినది ఏమిటంటే ఈ కామ క్రోధాదులు మనసుకు సంబంధించినవే తప్ప విషయములకు సంబంధించినవి కావు. కానీ విషయ సాంగత్య దోషము వలన అవి వృద్ధి చెంది దుర్భేద్యములౌతాయి. గీతాచార్యులు భగవద్గీతలో ఇదే విషయాన్ని వివరిస్తూ – **కామ ఏషక్రోధ ఏష రజోగుణసముద్భవః।మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్॥** కామ క్రోధములే అన్నింటికీ మూలమనీ, అవే సాధకుడికి ప్రబలమైన శత్రువులని తెలియజేశారు. ఈ కామాదులను చిగురించిన వెంటనే వాటిని తుంచి వేయగలగడం సాధ్యమవుతుంది. ఒకవేళ వాటికి దుస్సాంగత్యము కలిగినచో అవి గోరంతలు కొండంతలైనట్లు సముద్రం వలే మారి సాధనను నిరోధిస్తాయి. కాబట్టి సాధకుడు ఈ కామాదులను పుట్టిన వెంటనే తుంచి వేయవలెనని ఈ సూత్రం ద్వారా నారదులు తెలియజేస్తున్నారు.

# శ్రీబాబు దివ్యవాణి

(26-12-1976 న శ్రీబాబు దివ్యబోధామృతం)

శ్రీరామచంద్రుడు చక్కని ప్రవర్తన, రూపం కలవాడు. ఆర్తత్రాణ పరాయణుడు. శరణువేడిన వాడిని విడువని వాడు. రామదాసు ఎన్ని కష్టాలు వచ్చినా లెక్కచేయక ఓర్చి ఆ రాముడిని కొలిచి, గమ్యం చేరుకున్నాడు. మరణ వలయం నుండి మనలను రక్షించేది ఆ దివ్య నామమే! మనం ప్రపంచ విషయాదులలో పడి, ఆ నాగశయనుడిని మరచాము.

భగవంతుడు చేసే పనికి మనం అర్థం తెలుసుకోలేము. నాగరికత బలిసి, నాగశయనుడిని మరచాము. తాము అనుకున్న కోరికలు తీరితే తిరుపతి వచ్చి మొక్కులు చెల్లిస్తామని అంటారు. కాని వారి కోరికలు తీరిన తరువాత ఆ మొక్కులు చెల్లించరు. కాని వడ్డీకాసుల వాడు, వేంకటేశ్వరుడు (మా బ్రదర్) వడ్డీతో సహా గుంజుతాడు.

రామదాసు మన ఆంధ్రదేశంలో జన్మించి, పరమాత్మని సగుణంగా చూసుకున్న పరమ భక్తాగ్రేసరుడు. శ్రీరామ దర్శనం అయ్యేవరకు ఒడ్డున పడ్డ చేపలాగ కొట్టుకున్నాడు. కారాగారంలో దర్శనం అయ్యాక అంతులేని ఆనందం పొందాడు.

గజేంద్రునికి దేహదారుఢ్యం ఉన్నంత వరకూ తనకేమీ పట్టనట్లే ఉన్నాడు. కానీ **'రావుల్‌దప్పె మూర్ఛవచ్చె'** అన్నప్పుడు శ్రీమన్నారాయణుడు **'సిరికిం జెప్పడు, శంఖుచక్రముల్ చేదోయి సంధింపడు'** అన్నట్లు తహతహలాడుతూ భక్తరక్షణకు బయలుదేరి వచ్చి, మకరిని సంహరించి గజేంద్రుని రక్షించాడు. అట్టి ఆర్తత్రాణ పరాయణుడు శ్రీమన్నారాయణుడు!

## శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**సెప్టెంబర్ 2025**

5 శుక్ర: ఉపాధ్యాయ దినోత్సవం

7 ఆది: భాద్రపద పూర్ణిమ - ఆశ్రమ ట్రస్ట్ హాస్పిటల్ వార్షికోత్సవం. శ్రీ సద్గురు పాదపూజ

16 మంగళ: శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

20 శని: మాసశివరాత్రి

21 ఆది: అమావాస్య

22 సోమ: శ్రీ శరన్నవరాత్రి ప్రారంభం - ఉ. 8.46 గం.లకు అంకురార్పణ.

29 సోమ: మూలా నక్షత్రం - సరస్వతీ పూజ

30 మంగళ: దుర్గాష్టమి - సాముహిక కుంకుమ పూజలు

**అక్టోబర్ 2025**

1 బుధ: మహర్నవమి,

2 గురు: విజయదశమి - సాముహిక కుంకుమ పూజలు

3 శుక్ర: ఏకాదశి - ఏకాహం

4 శని: దీక్షావిరమణ, శ్రీ సద్గురు పాదపూజ.

7 మంగళ: ఆశ్వయుజ పూర్ణిమ - శ్రీ సద్గురు మండల దీక్ష ప్రారంభం. శ్రీ మాతాజీవారి జన్మదిన మహోత్సవం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన.

16 గురు: శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

19 ఆది: నరకచతుర్దశి మాసశివరాత్రి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన.

21 మంగళ: దీపావళి పండుగ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన. ఆకాశదీపం.

24 శుక్ర: అక్టోబరు 24 నుండి నవంబరు 1 వరకు శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి పంచామృతములు, నవరసములతో ఏకాదశ రుద్రాభిషేకములు, లక్ష బిల్వార్చన.

25 శని : నాగుల చవితి

## గురు క్షేత్రం

- పెనుమాక నాగేశ్వర రావు

ఆస్తికుడు అంటే ఆస్తిపరుడనీ, నాస్తికుడు అంటే న (ఆస్తికుడు) ఆస్తిలేని వాడు అంటే బీదవాడు అని అర్థం చెప్పుకుంటే, ఆ అర్థాన్ని ఒప్పుకుంటే, నిజంగానే ఆస్తికుడంటే ఆస్తిపరుడే. భగవంతుడు ఉన్నాడు అనే భావన కంటే గొప్ప ఆస్తి ఏముంటుంది? అలాగే నాస్తికుడు అంటే బీదవాడే. లేదు అనే భావనే బీదరికం కదా. ఒక్క డబ్బే కాదు. నాకు అందం లేదు, నాకు తెలివి లేదు, నాకు చదువు లేదు, నాకు హొదా లేదు, .....ఇలా ఏదయినా లేదు అనుకోవటమే బీదరికం. లేదు అనుకోవటం ఓ వెలితి, ఒక లోటు, ఒక అసంతృప్తి. కాబట్టి ఇంతకంటే బీదరికం ఇంకేముంటుంది? కాబట్టి దేవుడు లేడనుకునేవాడు ఖచ్చితంగా బీదవాడే.

అసలు భగవంతుడు అనేవాడు బయట ఎక్కడో లేదు, నీలోనే ఉన్నాడు అని కదా చెబుతున్నారు. అంతేగాదు నువ్వే భగవంతుడివి అని కూడా అంటున్నారు. బాగానే ఉంది. నేనే భగవంతుడిని అయితే నాలో దేవుడి లక్షణాలు ఉండాలికదా! అనుకోవచ్చు. నిన్ను నీవు తెలుసుకో అంటే అదే. నీ ఆలోచనలు ఎలా ఉంటున్నాయి? నీ సంస్కారం ఏ స్థాయిలో ఉంటున్నది? ఈర్ష్య, అసూయ ఎంతలా ఉన్నాయి? ఆడంబరం ఎంత వుంది? అహంకారం ఎంత ఉంది? అని నిన్ను నువ్వే ప్రశ్నించుకుని వాటిని ప్రయత్నపూర్వకంగా తగ్గించుకుని, వాటిని తగ్గించమంటూ పరమాత్మని వేడుకుంటూ ఉంటే నువ్వే భగవంతుడివి అని తెలుసుకోగలుగుతావు. కాబట్టి ఆ ప్రయత్నం చేయడానికి మనం సంసిద్ధం కావాలి. అలా సంసిద్ధపరచమని దేవుడిని వేడుకోవాలి.

అసలీ మధ్యన ఒకాయన ఏమన్నాడంటే, నీకు దేవుడి మీద నమ్మకం వుండటం కాదు, దేవుడికి నీమీద నమ్మకం ఉండాలి అన్నాడు. వినగానే విస్తుపోయాను. కొంచెం ఆలోచించిన మీదట నిజమేనేమో అనిపించింది. అంతలో ఆయనే మళ్ళీ ఏమన్నాడంటే నువ్వు నిజమైన భక్తుడివేనని, నీకు ఆయన మీద నమ్మకం ఉన్నమాట నిజమేనని, నీ మీద దేవుడికి నమ్మకం కలగాలి ముందు. నీ ప్రవర్తనలో నిజాయితీ వుండాలి. నీలో సహనం ఉండాలి. సంయమనం ఉండాలి. నీలో వినయం ఉండాలి, విచక్షణ ఉండాలి. అన్నింటికీ మించి ఆత్మవిశ్వాసం ఉండాలి. అందుకు తగిన ధైర్యం ఉండాలి.

అంతేకాదు నీ మాటల్లో సత్యం ఉండాలి. నీ చేతల్లో చిత్తశుద్ధి ఉండాలి. నీ మనసు నిర్మలంగా ఉండాలి. ఇవన్నీ ఉంటే, నీకు దేవుడి ఆశీస్సులు పొందటానికి అర్హత కలుగుతుంది. యోగ్యత కలుగుతుంది. ఏవేవో అవసరాల కోసం దేవుడ్ని నమ్మటం కాదు. దేవుడే నీ అవసరం కావాలి. దేవుడే నీ సర్వస్వం కావాలి. దైవస్మరణతో ఇది సాధ్యం అని చెబుతున్నారు. అలా స్మరణ చేస్తూ ఉంటే భగవంతుడు విని, వీడు

ఎప్పుడూ నన్నే తలుచుకుంటున్నాడు, వీడి అవసరాలు ఏమిటో ఆలోచిద్దాం అనుకుంటాడు. అవసరాలు ఎన్ని ఉన్నా, అవసరమైన వాటినే అందిస్తానంటున్నాడు. అవసరమైనంత వరకే అందిస్తానని కూడా అంటున్నాడు. అంతా మన మంచికే. అనవసరమైన లంపటం మనకెందుకు? అవసరాలు తీరిపోవటం కన్నా ఆనందం ఏముంటుంది?

దేవుడు ఎక్కడో లేదు, నీలోనే ఉన్నాడనిపించినప్పుడు, దేవుడికోసం ఎక్కడికీ వెళ్ళనక్కరలేదు. కానీ అలా అనిపించటంలో నిజాయితీ ఉండాలి. స్థిరత్వం ఉండాలి. ధృడత్వం ఉండాలి. లేదు, అక్కడికి వెళితే ఆ పని అవుతుందట, ఇక్కడికి వెళితే ఈ పని అవుతుందట అనిపించేటప్పుడు వెళ్ళటంలో తప్పులేదు. మనసు చెబుతున్నది అనుసరిస్తున్నావు. మనసు ఎప్పుడు ఎక్కడికీ వెళ్ళనవసరం లేదు అని చెబుతుందో, అప్పటినుంచి ఎక్కడికీ వెళ్ళనవసరం లేదు. అప్పుడు వెళ్ళటమూ తప్పుకాదు, ఇప్పుడు వెళ్ళకపోవడమూ తప్పు కాదు. అసలు తప్పుఒప్పుల గురించిన తర్జనభర్జనలే వద్దు అంటున్నారు కొందరు. నీ మనసుకు నచ్చినది చెయ్యి. భగవంతుడి మీద భారం వెయ్యి. ఫలితం ఏదయినా సరే. ఈ ఆలోచన ఉంటే అసలు బాధే ఉండదని వారి వాదన. ఆచరించ గలగాలే గానీ ఇంతకు మించిన తరణోపాయం ఇంకేముంటుంది అనిపించింది. అలాంటి స్థిరచిత్తంతో ఉండటానికి కూడా గురుకృప ముఖ్యం. అందుకే నీ రెండు చేతుల్లో ఓ చేతిని నా పాదాల మీద ఉంచి రెండో చేత్తో నీ లౌకిక వ్యవహారాలన్నీ నిర్వహించుకో, నీకు నా అభయహస్తం ఎప్పుడూ తోడుగా, నీడగా వుంటుంది అని చెప్పారు కదా! గురుమూర్తి.

మన దేహమే ఓ ధర్మక్షేత్రమని, దానిలో జరిగే ఆరాటాలు, పోరాటాలే కురుక్షేత్రమని ఉపమానాల్ని ఉదహరించారుగా పెద్దలు. వాటితో పాటే ధర్మక్షేత్రాలు, పుణ్యక్షేత్రాలు, తీర్ధయాత్రలు, వగైరా, వగైరాలు చాలా చెప్పారు . మొన్నీమధ్యనే ఓ ప్రవచనంలో భగవద్గీతలో మొదటి శ్లోకం లోనే ధృతరాష్ట్రుడు **ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమావేతా యుయుత్సవ : ..మామకా:**.....అని అడుగుతాడు. అంటే మా వాళ్ళకి, పాండవులకు మధ్యన ఏం జరుగుతున్నది? ఎలా జరుగుతున్నది? వివరించమని అడుగుతాడు, అక్కడే ఆయన స్వార్ధం, సంకుచిత మనసు తెలుస్తుంది. నావాళ్ళు, పరాయి వాళ్ళు అనటమే అందుకు తార్కాణం అని చెప్పారు. అందుకే మానవునికి, మానవునికి మధ్య భేద బుద్ధి నశించి, సర్వజీవులు సమభావముతోనూ, ప్రేమదృష్టితోనూ మెలగుదురు గాక అనే ప్రార్ధన మనకు అందించిన గురుదేవుల సన్నిధే ఆ గురుక్షేత్రమే అన్నీ క్షేత్రాలకు మించిన పుణ్యక్షేత్రం అనుకుని మెలగటం కన్నా కావలసింది ఏముంటుంది?

# ప్రథమ దర్శనము

- ధరణాల ప్రకాశరావు

'నువ్వు నాకు ఎన్నో జన్మల నుండీ తెలుసు. మనది జన్మజన్మల బంధం' అని శ్రీబాబు చెబుతూ వుండేవారు. సర్వజ్ఞుడు, సమర్థుడు అయిన సద్గురువు మాత్రమే అలా ఘంటాపథంగా చెప్పగలరు. మనంతట మనం ఆశ్రమానికి వస్తున్నాము, సద్గురువును దర్శిస్తున్నాము అని అనడం సబబు కాదు. మనకు వారి గురించి తెలియక పోయినా గాని, వారిని మనం చూడకపోయినా గాని సద్గురువు సంకల్పం, వారి అనుగ్రహం వుంటేనే మనం వారిని కవలడం, లేదా వారే కలవడం, వచ్చి మనకు వారి దర్శన భాగ్యం కలిగించడం జరుగుతుంది.

నేను హైదరాబాద్‌లో H.M.T కంపెనీలో ఉద్యోగం చేస్తూ వుండే వాడిని. అందులో పనిచేసే మిత్రులు కొందరు శ్రీ బాబూజీ భక్తులు. పికెట్‌లో వున్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి గుడిలో సత్సంగాలు జరిపేవారు. 'బాబూజీ గొప్ప మహాత్ములు, సద్గురువులు', అని వారు చెబుతుండేవారు. నేనూ వారితో బాబూజీ సత్సంగాలలో పాల్గొనేవాడిని. రోజూ ఆఫీస్ పని అయ్యాక మిత్రులతో కలసి, శ్రీ గంటా ప్రకాష్‌గారి ఇంటికి వెళ్ళి గంటసేపు ధ్యానం చేసుకుని ఇళ్ళకు వెళ్ళేవాళ్ళం.

నాకు 1991 సం॥ ఏప్రియల్ నెలలో హైదరాబాద్‌లో శ్రీ మాతాజీ వారి దర్శన భాగ్యం కలిగింది. వారి బోధ విన్నాను. నంబూరు లోని శ్రీ కాళీ గార్డెన్స్ ఆశ్రమానికి వెళ్ళాలని అప్పుడు కోరిక కలిగింది. ఆ సంవత్సరం జులై నెలలో ఆషాఢ పూర్ణిమకు నేను మొట్ట మొదటిసారిగా ఆశ్రమంలో అడుగు పెట్టాను. తెలియరాని, వింత అయిన అనుభూతి కలిగి, ఒళ్ళు పులకరించింది. అప్పటికి ఇంకా శ్రీబాబూజీ బృందావన నిర్మాణం జరుగలేదు. బృందావనం అప్పట్లో చిన్న పాకలో వుండేది. వెనుకవైపు పడమర దిక్కున శ్రీబాబూజీ నిలువెత్తు చిత్రపటం వుండేది. అది చూడగానే 'వీరిని చిన్నతనంలో ఎక్కడో చూశానే' అని స్ఫురించింది. శ్రీ ఇందుకూరి సత్యనారాయణ రాజుగారు (విప్పరు సత్తిరాజుగారు) కనిపించారు. వీరిని కూడా నా చిన్నప్పుడు గోపాల పురంలో మా చిన్నతాతగారింట్లో శ్రీ బాబూజీతో కలిసి వుండటం చూశాను కదూ! కొన్ని రోజులు ఆశ్రమంలో వుండి హైదరాబాద్ వెళ్ళి పోయాను.

చిన్ననాటి కొన్ని తీపి సంఘటనలు నా మదిలో మెదిలాయి.... మా చిన్నతాతయ్య (మా అమ్మకు చిన్నాన్న) శ్రీ మైగాపుల జగన్నాథం గారు తూర్పు గోదావరి జిల్లా గోపాలపురంలో వుండేవారు. ఏటిగట్టు ప్రక్కనే వారి మేడ. సిద్ధాంతం రేవు దాటాక వున్న పల్లెపాలెం. గ్రామం పుంత ప్రక్కనే వారి పొలాలు వుండేవి. వారి ఇంటికి దగ్గరలోనే మా ఇల్లు వుండేది. 1956 సం॥లో సుమారు నాకు 9 సంవత్సరాలు వుండగా, ఒకరోజు శ్రీబాబు, ఇంకొక వ్యక్తి సిద్ధాంతం రేవు దాటి, పొలాల మీదుగా వస్తున్నారు. బాగా పొద్దు పోయింది. వారిని నా మేనమామ శ్రీ మైగాపుల శ్రీరామ మూర్తిగారు చూసి, వారిని కలిసి, 'బాగా పొద్దుపోయింది, చీకటిలో ముందుకు వెళ్ళడం మంచిదికాదు. మా ఇల్లు దగ్గరలోనే వుంది. వచ్చి విశ్రాంతి తీసుకోండి, రేపు ఉదయమే వెళ్ళవచ్చు' అని ఆహ్వానించి, వారిని ఇంటికి తీసుకు వచ్చారు. నేను మరునాటి ఉదయం తాతగారి ఇంటికి వెళ్ళాను. శ్రీబాబును చూశాను. అది ప్రథమ దర్శనం! వారు ఎవరో నాకు తెలియదు. ఇంట్లో ఎవరికీ వారి గురించి తెలియదు. వారితో పాటు ఒక వ్యక్తి వుండటం చూశాను. పూజ ముగించిన శ్రీబాబు ఒక గారెను నాకు ప్రసాదంగా ఇచ్చారు.

1991 సం॥ జులై నెలలో ఆశ్రమం నుండి తిరిగి హైదరాబాద్ వెళ్ళిన సుమారు పదిరోజులకు రాత్రి నిద్రలో నాకు ఒక కల వచ్చింది. ఆ కలలో ... నేను గోపాల పురంలోని మా చిన్న తాతగారి ఇంటి బయట పిల్లలతో ఆడుకుంటున్నాను. శ్రీబాబు మేడలో నుండి బయటకు వస్తూ నన్ను పిలిచి, 'ఒరేయ్! ఆ జామచెట్టు ఎక్కి, ఒక కాయ కోసుకురా!' అన్నారు. నేను కాయ కోయడానికి వెడుతున్నాను.. ఇంతలో మెలకువ వచ్చింది. కల చెదిరింది.

శ్రీబాబును ఇలా కలలో చూసి, నా చిన్నప్పుడు 9 సం॥ల వయస్సులో తాతగారి మేడలో చూసినది ఈ మహాత్ముడే అని నిర్ధారించుకున్నాను. గురువు పైన విశ్వాసం గట్టిపడింది.

H.M.T కంపెనీలో నేను తయారు చేసిన డ్రాయింగ్‌ను అనుసరించి, ముందుగా చెక్కతో ఒక నమూనాను పేటర్న్ డిపార్ట్‌మెంట్‌లో తయారు చేయాలి. ఆ డిపార్ట్‌మెంట్ వారికి నా డ్రాయింగ్‌లో ఏదో సందేహం వచ్చింది. వారు నాకు ఫోన్ చేశారు.

నేను వారి సందేహం తీర్చాను. కానీ, 'స్వయంగా వెళ్ళి చర్చించు' అని నా అంతర్వాణి హెచ్చరించింది. నేను స్వయంగా వెళ్ళి తిరిగి వివరంగా చర్చించాను. ఆ సమయంలో నేను పనిచేసే చోట వున్న డ్రాయింగ్ బోర్డుకు బిగించి వున్న సుమారు 10 కిలోల బరువు వున్న కౌంటర్ వెయిట్ నా కుర్చీమీద పడింది. నేను గనుక అక్కడే వుండి వుంటే ఖచ్చితంగా అది నా నెత్తి మీద పడి వుండేది. హెచ్చరించిన అంతర్వాణి శ్రీ బాబు సంకల్పమే కదా! గురు రక్షణలోని మాధుర్యాన్ని ఈ విధంగా అనుభవించాను.

2008లో జరిగిన మరొక 'గురు రక్షణ' సంఘటన..... మా కోడలు హైదరాబాద్‌లో పుట్టింట్లో ప్రసవించింది. మా అబ్బాయికి హైదరాబాద్ నుండి కేరళలోని కొచ్చిన్‌కు బదిలీ అయింది. అబ్బాయి, తోడుగా నా భార్య కొచ్చిన్ వెళ్ళారు. నేను నంబూరు ఆశ్రమానికి వచ్చి, అమ్మ దర్శనం చేసుకుని, ఆశీర్వాదం తీసుకుని, కేరళ వెడదామనుకున్నాను. ఏదో పని మీద హైదరాబాద్‌లో వున్న మా అమ్మాయి ఇంటికి ఆటోలో వెడుతున్నాను. ఒక అబ్బాయి బైక్ మీద స్పీడ్‌గా వస్తూ ఆటోను ఢీ కొట్టాడు. ఆటో తిరగబడింది. నేను క్రింద పడ్డాను. క్రింద పడ్డ నన్ను ఆటో కొంత దూరం ఈడ్చుకు వెళ్ళింది. ఎడమ భుజం చాలా నొప్పి పుట్టింది. K.J.M.S ఆసుపత్రిలో ఒక జూనియర్ డాక్టరు గారు చూసి, 'ఆపరేషన్ అవసరం అవుతుంది' అన్నారు. కానీ ఆ తరువాత సీనియర్ డాక్టర్ నా ఎక్సరే చూసి, 'ఏమీ ఫరవాలేదు, ఆపరేషన్ అవసరం లేదు. మందులు వాడండి కొద్ది రోజులలో తగ్గిపోతుంది. కొంతకాలం ఇబ్బందితో పనులు చేసుకోగలుగుతారు. చేతిని కొద్ది కొద్దిగా పైకి లేపే ప్రయత్నం చేయండి' అన్నారు. కేరళ వెళ్ళాను. ఆయుర్వేద ఆసుపత్రిలో చూపించాను. వారు చేసిన ఆయిల్ కాపడాలు వగైరా వైద్యంతో నా భుజం నొప్పి తగ్గింది.

భక్తులు ఏ పరిస్థితిలో వున్నాగానీ, గురురక్షణ వారిని వెన్నంటే వుంటుంది. కావలసినది గురువుపై విశ్వాసం. 'నేను కామవరపుకోట జీడిని. పట్టుకుంటే వదిలిపెట్టను' అని అంటుండేవారు శ్రీబాబు! భక్తజన రక్షణ వారికి ప్రీతి, మనకు అభయం! విశ్వసించు! తరించు!

# నిరీక్షణ

(గత సంచిక తరువాయి)

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్

తెలుగు అనువాదం - శశికళా దివాకర్

**కష్టమును తీర్చిన సుందరుడు**

ఇదియే రామాయణ కావ్యమందలి సుందరాకాండ ఆరంభము. సుందరాకాండమునందు హనుమంతునిదే ప్రధాన పాత్ర. ఈ కాండ మధ్యమందే రాముడరుదెంచును. గాన దీనిని సుందరుని కాండము అని చెప్పవచ్చును. ఏడు కాండములతో కూడిన రామాయణ కావ్యమందు ఈ కాండము మినహా మిగిలిన ఆరు కాండముల పేర్లు ఆయా సమయమందు జరిగిన కార్యముతో కూడిన పేర్లను పెట్టి ఈ కాండమునకు మాత్రము హనుమంతుని పేరును ఆపాదించారు. దానికి గల కారణమేమైయుంటుందని కాస్త పరిశీలిద్దామా! 'సుందరం' యను సంస్కృతపదమునకు 'అందము' అని అర్థం. ఈకాండమును గూర్చి సంస్కృతమందలి ఒక శ్లోకం ఇవ్విధముగ తెలియజేయుచున్నది.

**సుందరే సుందరో రామః**
**సుందరే సుందరి కథా**
**సుందరే సుందరి సీత**
**సుందరే సుందరం వనం**
**సుందరే సుందరం కావ్యం**
**సుందరే సుందరో కపిః**
**సుందరే సుందరం మంత్రం**
**సుందరే కిం న సుందరం**

సౌందర్యానికి ప్రతీకయైన రాముడే సుందరమూర్తి. ఆ సుందర శ్రీరాముని కథయే ఒక రమణీయమైన గాథ. సుందరకాండము యొక్క సౌందర్య దేవతయే సీత. సుందరకాండమందలి అశోకవనమే మనోహరమైన వనం. సుందరకాండము మనస్సుకు ఆహ్లాదమునొసగు ఒక రమ్యమైన కావ్యం. ఈ కాండమందలి వానరవీరుడైన హనుమంతుడే సుందరుడు. ఈ కాండము అందమైన మంత్రములతో కూడియుండును. సుందరకాండమందు ఏది సౌందర్యరహితమైనది?

విశ్వకర్మచే కుబేరుని కొరకు నిర్మించబడిన రమ్యమైన లంకా నగరమందలి, పుష్పములు విరబూసియుండు అశోకవనమందలి వృక్షములు, పూలతో నిండియున్న లతల సౌందర్యము వర్ణనాతీతము. హనుమంతుడు తాను ఎప్పుడూ చూడని, ముందువెనుకలు తెలియని సీతాదేవి వద్ద తనను తాను పరిచయమొనర్చుకొను విధము, రాముని దివ్యనామమును ఆమెకు తెలిపిన తీరు, భూదేవి పుత్రికైన సీత వద్ద హనుమంతుడు శ్లాఘిస్తూ, అందానికే అందము సంతరించినట్లున్న సీతయొక్క సౌశీల్యమును రామునికి వివరించిన విధము మున్నగు విషయములన్నియూ ఈ కాండమందు వివరింపబడి యుండుట చేత దీనికి సుందరకాండమనుపేరు పరిపూర్ణతను చేకూర్చిందనే చెప్పవచ్చును.

మహేంద్రగిరి నుండి సముద్రమును దాటుకొనుచు ఆకాశ మార్గమున గరుత్మంతునివలె ఎగురుకొనుచు వచ్చు హనుమంతుని గాంచి, అంతవరకు సముద్రములో మునిగియున్న మైనాక పర్వతం పైకిలేచి సముద్ర ఉపరితలమును దాటి పైకెగసి ఆతనికి అడ్డుగ నిలిచింది. “ఓ హనుమా! నేను నీకు శతృవునుగాను. గతమున ఒక సమయమందు దేవేంద్రుడు ఎగిరే గుణముగల కొండలనన్నింటి రెక్కలను నరకివేసి భూమిపై నిలిచిపోవునట్లు చేసాడు. ఆ దృశ్యమును గాంచి భయపడిన నన్ను చూసి, మీ తండ్రి వాయుదేవుడు నన్ను భద్రంగా ఎత్తుకుని వెళ్ళి ఈ సముద్రగర్భమందు దాచారు. దానికి నేను కృతజ్ఞతలు తెలియజేయుచున్నాను. కావున కాసేపు నాపై నిలిచి, ముందుకు సాగమని కోరుచున్నాను” అన్నది మైనాక పర్వతం హనుమంతునితో. దానికి హనుమంతుడు, “ఇప్పుడు నేను రామకార్య నిమిత్తమై వెడలుచున్నాను. నన్ను బలవంతము చేయవలదు. నా కార్యము విజయ వంతముగ పూర్తి చేసుకుని తిరిగివచ్చు సమయమున తప్పక నీపై విశ్రాంతి తీసుకుని నీ కోరిక నెరవేరుస్తాన”ని చెప్పి మైనాక పర్వతమును బలముగ అదిమి క్రిందకు నెట్టివేసి తన పయనమును ముందుకు కొనసాగించాడు హనుమంతుడు.

- సశేషం

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్ శాఖ వారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......

**సెప్టెంబర్ 2025**

7 ఆది: భాద్రపద పూర్ణిమ - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

16 మంగళ: శ్రీ గురుదశమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

22 సోమ: శ్రీ శరన్నవరాత్రి ప్రారంభం.

**అక్టోబర్ 2025**

2 గురు: విజయదశమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

7 మంగళ: ఆశ్వయుజ పూర్ణిమ - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

16 గురు: శ్రీ గురుదశమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

21 మంగళ: దీపావళి పండుగ - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును**

**సెప్టెంబర్ 2025**

7 ఆది: భాద్రపద పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ.

16 మంగళ: శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ.

22 సోమ: శ్రీ శరన్నవరాత్రి ప్రారంభం - శ్రీ సద్గురు పాదపూజ.

**అక్టోబర్ 2025**

2 గురు: విజయదశమి - శ్రీ సద్గురు పాదపూజ.

7 మంగళ: ఆశ్వయుజ పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ.

16 గురు: శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ.

21 మంగళ: దీపావళి పండుగ - శ్రీ సద్గురు పాదపూజ.

(గత సంచిక తరువాయి) **శ్రీ గురుగీతా** -కీ.శే డా॥వి.వి. ప్రసాదరావు

## అథ ప్రథమోధ్యాయః

**సర్వతీర్థా వగాహస్య సంప్రాపోష్ణతి ఫలంనరః**
**గురోః పాదోదకం పీత్వా, శేషం శిరసి ధారయన్. 29**

**<u>పదవిభాగము</u>** :- సర్వతీర్థ-అవగాహస్య-సంప్రాపోష్ణతి-ఫలం-నరః-గురోః-పాద-ఉదకం-పిత్వా-శేషం-శిరసి-ధారయన్.

**<u>టీక</u>** :- గురోః=గురుదేవుల; పాద=పాదసంబంధమైన; ఉదకం=తీర్థమును; పీత్వా=(కొంత)త్రాగి; శేషం=మిగిలిన దానిని; శిరసి=శిరస్సు నందు; ధారయన్=ధరించుట వలన; నరః=దేహి; జీవుడు, సర్వతీర్థ=సర్వపుణ్య తీర్థములలో చేసిన; అవగాహస్య=స్నానము యొక్క; ఫలం= ఫలమును; సంప్రాపోష్ణతి=చక్కగా పొందుతారు.

**<u>వ్యాఖ్య</u>** :- "శ్రీగురు దేవుల పాద తీర్థాన్ని కొంత తాను త్రాగి, మిగిలిన భాగాన్ని శిరస్సున ధరించిన దేహధారి సర్వ పుణ్యతీర్థములలోనూ స్నానము చేసిన పుణ్యాన్ని చక్కగా పొందుతాడు" అని వివరించాడు స్వామి. ఇక "పాదతీర్థం" అనే మాట జాగ్రత్తగా అర్థం చేసుకొనవలసి ఉన్నది. "పదము" అనే శబ్దానికి వ్యవసితము (ఉద్యోగము) త్రాణ(రక్షణ); స్థాన(పదవి) లక్ష్య(బ్రహ్మము), అంఘ్రి(చరణము) వస్తువు(పదార్థము) అనే అర్థాలున్నాయి. "**పద్యతే అనేనేతి పదం**" అని వ్యుత్పత్తి. పొందించేది గనుక పదము అని అర్థము. శ్రీ బాబూజీ వారు 'పదము' అనే శబ్దానికి చరణము, శబ్దము, పదవి అనే మూడు అర్థాలనూ వివరించారు. శ్రీ గురుదేవుల "పాదోదకము" అనగా వారి "పదముల" (మాటల) సారము అని అర్థంచెప్పారు. శ్రీ గురుదేవుల పాదాలను ఆశ్రయించి, వారి బోధాసారాన్ని స్వీకరించి, శిరోధార్యం చేసుకొంటే జీవుడు బ్రహ్మ పదాన్ని పొందుతాడని వారు వ్యాఖ్యానించేవారు. అందువలన గురుపాద తీర్థ సేవనము అన్ని తీర్థాలలో మునిగిన పుణ్యాన్ని ప్రసాదించి జీవుడిని నిర్మలుణ్ణి చేయటంలో ఆశ్చర్యంలేదు. అసలు జీవుడు బ్రహ్మత్వాన్ని తనలో గుర్తించటానికి అడ్డుగా ఉన్నది మల, విక్షేప ఆవరణలు. అందులో మొదటిదైన మల దోషం గురుపాద

తీర్థ సేవనంలో, గురు బోధతో, దానిని పాటించటంతో తీరుతుందనటంలో ఆశ్చర్యమేమీ లేదుగదా!

**శోషణం పాప పంకస్య దీపనం జ్ఞాన తేజసః**
**గురోః పాదోదకం సమ్యక్ సంసారార్ణవతారకం. 30**

<u>**పదవిభాగము**</u> :-

**శోషణం-పాపపంకస్య-దీపనం-జ్ఞానతేజసః-గురోః-పాదోదకం-సమ్యక్-సంసారార్ణవ-తారకం.**

<u>**టీక**</u> :- గురోః=శ్రీ గురుదేవుల; పాదోదకం=పాదతీర్థము; పాపపంకస్య=పాపమను బురదను; శోషణం=ఎండిస్తుంది; జ్ఞానతేజసః= జ్ఞానమను దీప్తిని; దీపనం=వెలిగిస్తుంది; సంసారార్ణవ= సంసారమను సముద్రమును; సమ్యక్=చక్కగా; తారకం=దాటిస్తుంది.

<u>**వ్యాఖ్య**</u> :- "శ్రీ గురుదేవుల పాదతీర్థము పాపమనే బురదను ఎండిస్తుంది, జ్ఞానమనే అగ్నిని ప్రజ్వలింపజేస్తుంది, సంసారమనే సముద్రాన్ని తరింపజేస్తుంది" అంటున్నాడు పరమేశ్వరుడు.

"తీర్థం" ద్రవరూపమైనది. పవిత్రమైనది. జలమే. అయినా జలం ఎండించటమేమిటి? అగ్నిని ఉద్దీపించటమేమిటి? నీటిలో మునిగి పోయే వాణ్ణి తరింపజేయటమేమిటి? అదే విచిత్రం. అపాంతర తముడైన వ్యాస మహర్షి కవితాలతకు పూచిన విచిత్ర విరోధా భాసాలంకారమిది. కేవలం తీర్థమైతే – లేదా ఆమాటకు వస్తే ఎంత పుణ్యనదీ తీర్థమైనా, బురదను తడిపి మరీ పంకిలం చేస్తుంది, నిప్పును ఆర్పుతుంది, ఉన్న ప్రవాహాన్ని లేక జలాన్ని ఎక్కువ చేసి దానిలో చిక్కుకున్న వారిని ముంచుతుంది. కాని గురుపాద తీర్థం అమోఘమూ, అత్యాశ్చర్య కరమైన శక్తినీ కలిగినది. అది పాపపంకాన్ని ఎండించి, జ్ఞానాగ్నిని ఉద్దీపనంచేసి, భవసాగరాన్ని దాటించగలదు. "గురుపాద తీర్థానికి ఇంతశక్తి ఉన్నది. ఓ పార్వతీ! గురు మహత్యమెటువంటిదో దీనినిబట్టి ఊహించుకో" అంటున్నాడు పరమేశ్వరుడు.

- సశేషం

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## అప్పన వారితో శ్రీబాబు

(గత సంచిక తరువాయి) - కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

### మహా శివరాత్రి

**గురురేవ శివ స్సాక్షాత్** - గురుదేవులే సాక్షాత్తు పరశివ స్వరూపులని గురుగీత చెబుతోంది. వారి మూడవ నేత్రము జ్ఞాన నేత్రము. అందుండి వెలువడే జ్ఞాన కిరణాలు అగ్నివలె పాపములను దహించనూ గలవు. ఆ కిరణములే చల్లని జ్ఞాన చంద్రికలను వెదజల్లి, ఆశ్రితులను ఆత్మానందామృత సముద్రములో ఓలలాడించనూ గలవు. కనుకనే గురుభక్తులు మహాశివరాత్రి నాడు తమ గురుదేవులను పరమ శివునిగా భావించి పూజించుకుంటారు.



మహాశివరాత్రి నాటికి ముందురోజే భక్తులందరూ వివిధ ప్రదేశాల నుండి తండోపతండాలుగా ముంజవరపుకొట్టు వచ్చేవారు. పండుగనాటి ఉదయము శ్రీ గురుదేవులను పీఠముపై ఆసీనులను చేసి పెద్ద ముత్తైదువులు బాల శివునికి తలకు నూనె పెట్టి హారతిచ్చేవారు. అనంతరము వేదవిదులు మహారుద్ర (121 సార్లు నమక చమకములు), పురుషసూక్త, శ్రీసూక్త, ఉపనిషత్ పఠనము జరుపుతుండగా సహస్రఘటాభిషేకము ప్రారంభమయ్యేది.

భక్తులందరూ బిందెలతోను, మోయగలిగినవారు గుండిగలతోను , గంగాళములతోను గౌతమీ జలాలను తెచ్చి, అలుపెరుగని మహోత్సాహముతోను, అవధులులేని ఆనందపారవశ్యముతోను, 'హర హర మహాదేవ' అనే నినాదంతో దిక్కులు పిక్కటిల్లుతుండగా, పరశివ స్వరూపులైన శ్రీ గురుదేవులకు అభిషేకిస్తుంటే ఆకాశము నుండి గంగామతల్లి పరమశివుని శిరస్సుపై అవతరిస్తున్న దివ్య భావనలు అందరి మనస్సులలోను ముప్పిరిగొనేవి.

తమ శిరస్సుపై నిర్విరామంగా పడుతున్న జలపాతమును, శ్రీమన్నారాయణ పాదాంగుష్ట సంభూతయైన గంగా ప్రవంతిగా స్వీకరించే క్షణంలో, శ్రీగురుదేవులు పరమ శివ స్వరూపులై భాసిల్లే వారు.

ఆ జలమే వారి శిరస్సు నుండి జాలువారి, శ్రీగురుదేవుల దివ్య పాదాంగుష్టముల నుండి వెలువడే క్షణంలో వారే శ్రీమన్నారాయణ స్వరూపులై వెలుగొందేవారు. ఏక కాలంలో శ్రీబాబు హరిహర సమన్వయ స్వరూపులైన పరబ్రహ్మ మూర్తులై ప్రకాశించే మహత్తర సన్నివేశమిది. ఆ అపురూప దృశ్యమును తిలకించి తరించటానికి, దేవతలు, మునులు దిగివచ్చిన పవిత్ర, దివ్య, భవ్య వాతావరణము అక్కడ నెలకొనేది. అభిషేకానంతరము స్వామి తమ పూజాపీఠం వద్ద పూజ జరుపుకొని అందరికి తీర్థ ప్రసాదము లిచ్చేవారు. ఆ తరువాత జగన్మాతకు నివేదితమైన మహాప్రసాదమును భక్తులందరూ స్వీకరించే వారు.

ఆనాటి రాత్రి, రెండవ పూజకూడా స్వామి ముగించుకొన్న పిదప, రాత్రి సుమారు 9 గంటలకు శ్రీబాబు భక్తులందరితో కలసి పడవలలో బయలుదేరి, పవిత్ర గోదావరీనదీ మధ్యమున బల్లకట్ల కూర్పుతో నిర్మించ బడిన మహా వేదికపై అద్వైత సింహాసనాసీనులై విరాజిల్లే వారు. భక్తులు అరటి బెరళ్ళతో దీపములు వెలిగించి గౌతమీ నదిలో విడిచేవారు. మాఘ బహుళ చతుర్దశి నాటి అర్థరాత్రి వేళ గౌతమీనది నల్లని ఆకాశమువలెను, వందల వేల సంఖ్యలో కదులుతున్న ఆ దీపాలు నక్షత్రాల వలెను, మధ్యలో శ్రీగురుదేవులు పూర్ణ చంద్రుని వలెను వెలుగొందుతుండగా, నింగినున్న అమావాస్య పూర్వ రాత్రి నేలకు దిగి పూర్ణిమ నాటి రాత్రి వలె భాసించేది. గురుచంద్రుడు ప్రకాశించే చోట నిత్య పూర్ణిమయే గదా!

- సశేషం

## జీవుడు – పరమాత్మ

- ఎన్. కుట్టీ

ఆత్మను తెలుసుకోవడమే మానవుని ముఖ్య కర్తవ్యం. మానవులంతా భగవంతుని స్వరూపాలే. అహంకార మమకారాలు వున్నంత వరకూ ఈ జీవుడు భగవంతుని తెలుసుకోలేడు. ఇష్టమున్నా, లేకపోయినా ఈ జీవుడు మానవజన్మ వచ్చిన తరువాత సద్గురువు చెప్పినట్లు చెయ్యవలసినదే. అలా చేయకపోతే ఆత్మను తెలుసుకోలేరు. గురువు అనుగ్రహం పొందాలంటే శిష్యుడు తనలోని వాసనలను వదలిపెట్టాలి. సద్గురువును తెలుసుకోవాలంటే, సద్గురు బోధనలను శ్రవణం చేయాలి, వాటిని అహర్నిశలూ మననం చేస్తే, అది నిదిధ్యాస క్రింద వస్తుంది. మనస్సును భగవంతునిలో లీనం అయ్యేటట్లు ప్రయత్నించాలి.

ఒక కష్టం రాగానే, ఒక సుఖం వస్తుంది. కష్టం వచ్చినప్పుడు క్రుంగిపోయి, సుఖం వచ్చినప్పుడు సంతోషంతో పొంగిపోకూడదు. ఈ కష్టసుఖాలు వస్తూపోతూ వుంటాయి. వాటి గురించి ఆలోచించకూడదు. జీవుడు ఎల్లవేళలా తన దృష్టిని సద్గురువుపై వుంచాలి అప్పుడే సద్గురువుకు, భగవానుడికి తేడా ఏమిటో తెలుస్తుంది. అప్పుడు శ్రీబాబూజీ ఎన్ని అవతారాలు ఎత్తినా ఒక్కటే అని తెలుస్తుంది. జీవితం అంటే కామ, క్రోధ, మద, మాత్సర్యాలతో నిండిపోవడం, సుఖసంతోషాలతో కొట్టుమిట్టాడటం అంతే తప్ప ఈ మానవుడికి భగంతుడిని  తెలుసుకుందామని వుండదు.


భగవంతుడు ఈ జీవితాన్ని ఇచ్చింది పరమాత్మను తెలుసుకుని, ఇంకో జన్మలేకుండా చేసుకోవడానికే. కనుక ఈ జీవితం శాశ్వతం కాదు. ఈ జీవుడు భగవంతుడు ఎక్కడో వున్నాడని, పుణ్యక్షేత్రాలలో, గుళ్ళల్లో వెతుకుతూ వుంటాడు. కానీ భగవంతుడు మనలోనే వున్నాడు. అది తెలుసుకోవడానికి తీవ్రంగా సాధన చేయాలి, తపించాలి. అప్పుడే సద్గురు పరమాత్మ మనలోనే వున్నాడని తెలుస్తుంది. మన చిత్తము ఈ జీవుడితో ఆటలాడుతుంటుంది. ఇది ఆత్మను పరమాత్మ వద్దకు పోనీయకుండా నక్కజిత్తుల వేషాలు వేస్తూ వుంటుంది.

దేహమే దేవాలయం. ఈ జీవుని దేహంలో పరమాత్ముడు వున్నాడు. దేహమంతా బ్రహ్మమయం. ఆ బ్రహ్మమే ఆత్మ. నేను అనేది అహంకారం. నాది అనేది మమకారం. నేను నాది దూరమైనప్పుడే ఈ జీవుడికి పరమాత్మ ఎవరో తెలుస్తుంది.

-రమణ ప్రసాద్

# వేమన

వేమన ప్రజాకవిగా ప్రసిద్ధి చెందాడు. ఆయన సందేశం ఆంధ్రదేశమంతటా వ్యాపించింది. ఆయన కొండవీటి రెడ్డిరాజుల పరివారంలో వాడని చెబుతారు. వేమన వ్రాసిన పద్యాలు వేలకు వేలు. సమాజంలోని అవకతవకలు, అంధవిశ్వాసాలు, అత్యాచారాలు, అవినీతి మొదలైన వాటిని ఖండిస్తూ వ్రాసిన పద్యాలలో సూటితనం, సరళత్వం, వ్యంగం ఉట్టిపడుతుంటాయి.



ఆంధ్రదేశంలో వేమన వ్రాసిన పద్యం రానివారు ఒక్కరూ ఉండరు. "గంగిగోవు పాలు, గరిటెడైన చాలు; ఇంటిదాని పోరు ఇంతింత కాదయా; ఆకలన్నవాని కన్నంబు బెట్టిన హరున కర్పితముగ ఆరగించు;" అనే పద్యాలు అందరి నోళ్ళలోను నలుగుతాయి. ఆయన పద్యాలు "విశ్వదాభిరామ వినురవేమ" అనే మకుటంతో వ్రాశాడు.

వేమన ప్రపంచానుభవం చాలా గొప్పది. వేమన శైవ పరంపరకు చెందినవాడు. వేమన శివయోగి అని, సోమశేఖరుడు ఆయన గురువని తెలియవస్తోంది. ఈయన పదిహేనవ శతాబ్దం నాటివాడు. ఈయన, పోతులూరి వీరబ్రహ్మంగారు సమకాలికులు. అనంతపురం జిల్లా కదిరి తాలూకాలో కటారు పల్లెలో వేమన సమాధి ఉన్నది.

వేమన, గడ్డం వేమన అనే కొండవీటిరాజు మూడవ కొడుకు. వేమన జీవితం భోగాలతో విలాసాలతో గడిచింది. అతను ఒక వేశ్య వద్దకు వెళ్ళేవాడు, నగలు ,డబ్బు ఇచ్చి ఆమెను సంతోష పెట్టేవాడు. వేమనకు అతని వదినగారంటే ఎంతో గౌరవం. ఒకసారి వేశ్య ఇంటికి వెళ్ళినప్పుడు ఆమె వదినగారి ముక్కు పుడకను తెచ్చి ఇమ్మంటుంది. వేమన వెళ్ళి వదినగారిని అడుగుతాడు. ఆమె "నేను నగ్నంగా ఉన్నప్పుడు వచ్చి తీసుకోమంటుంది." వదినగారిని నగ్నంగా

చూసి అతనిలో వైరాగ్య జ్వాల రగులుకుంటుంది. అందరిని వదిలి ఒక చెట్టు కింద నగ్నంగా కూర్చుంటాడు. అతనికి జ్ఞానోదయమవుతుంది.

వేమన వీరశైవ వాతావరణంలో పుట్టి సంసార సుఖాలన్నిటిని అనుభవించి శివయోగుల సహవాసంతో విరక్తుడై, రాజయోగియై అద్వైతానందము అనుభవించి జీవన్ముక్తుడైనట్టు చెబుతారు. ఇతడు ఏ శతాబ్దానికి చెందినవాడైతేనేమి, ఏ కులమునకు చెందిన వాడైతేనేమి మనకు కావలసినది ఇతని కవిత్వము, ఇతని మానవతావాదం.ఆంధ్రదేశంలో నానుడులుగా నిలచిపోయిన పద్యాలు ఆ మహాకవికి నివాళులు.

అల్పుడెప్పుడు పల్కు ఆడంబరముగాను
సజ్జనుండు పల్కు చల్లగాను
కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా
విశ్వదాభిరామ వినురవేమ ॥

అనగ నగ రాగమతిశయిల్లుచునుండు
దినగఁ దినగ వేము తియ్యనుండు
సాధనమున పనులు సమకూడు ధరలోన
విశ్వదాభిరామ వినురవేమ ॥

అనువుగాని చోట నధికుల మనరాదు
కొంచమయిన నదియు గొదువగాదు
కొండయద్దమందు గొంచెమైయుండదా
విశ్వదాభిరామ వినురవేమ ॥

ఎలుకతోలు దెచ్చి ఏడాది యుతికిన
నలుపు నలుపేగాని తెలుపుగాదు
కొయ్య బొమ్మ దెచ్చి కొట్టిన బలుకునా
విశ్వదాభిరామ వినురవేమ ॥

- సశేషం

Published by Paluri Siva Rama Kaliprasad, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Nagendra Enterprises, 24-7-8, Sandeep Mansion, Jonnavittula Vari St.,Gandhi Nagar, Vijayawada-520003,N.T.R.Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

## జులై 3 నుండి 6 వరకు అమెరికాలోని లెక్సింగ్‌టన్, కెంటకీ నందు
## శ్రీ మఠం శ్రీనివాస్, సుశీలగార్ల గృహములో జరిగిన త్రయాహ్నిక దీక్షా దృశ్యములు











REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on Fifth and Sixth of every month


RNI No. 37804/81
POSTAL REGD. No. : GTR/27/2024-26



లెక్సింగ్‌టన్, త్రయాహ్నిక
దీక్షా సమయమందు



మెంఫసిస్ లోని
వెంకటేశ్వరస్వామి
మందిరంలో



కృష్ణాష్టమినాడు ఆశ్రమానికి
విచ్చేసిన భువనేశ్వరీ
పీఠాధిపతులు
శ్రీశ్రీశ్రీ కమలానంద భారతీ
స్వామివారు.

If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.